teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 124 | చీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 29 ఆగస్టు 2024 | పేజీలు : 08 | వెల ‘5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## కొత్త రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### 730 ప్రైవేట్ ఎఫ్ఎం స్టేషన్ల ఏర్పాటు కోసం త్వరలోనే ఈ-వేలం



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): కొత్త ఎఫ్ఎమ్ రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ మేరకు దేశంలోని 234 నగరాల్లో 730 ప్రైవేట్ ఎఫ్ఎం స్టేషన్ల ఏర్పాటు కోసం త్వరలోనే ఈ-వేలం నిర్వహిస్తామని కేంద్ర సమాచార, ప్రసార, రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ప్రధాని మోడీ అధ్యక్షతన బుధవారం జరిగిన కేబినెట్ నిర్ణయాలను ఆయన మీడియాకు వెల్లడించారు. మాతృభాషలో స్థానిక కంటెంట్‌ను పెంచడంతో పాటు కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించడంలో భాగంగా టైర్-2, టైర్ -3 నగరాలకు ఎఫ్ఎమ్ రేడియోను తీసుకెళ్తామని వెల్లడించారు. స్థానికంగా

మిగతా 2 లో

## సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మరోసారి ఫైర్

### అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం



హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): సీఎం రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మరోసారి మండిపడ్డారు. సోనియాగాంధీని దెయ్యం, పిశాచి, బలి దేవత అని అన్న నువ్వా రాజీవ్ గాంధీ మీద ప్రేమ ఒలకబోసేది అని విమర్శించారు. దొడ్డి దారిన పీసీసీ ప్రెసిడెంట్ అయ్యి ఇవాళ రాజీవ్‌గాంధీ మీద నువ్వు ఒలకబోస్తున్న కపట ప్రేమ అసలు రంగు అందరికీ తెలుసని అన్నారు. నీ ఆలోచనల్లో కుసంస్కారం నీ మాటలు అష్ట వికారం అని సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ధ్వజమెత్తారు. తెలంగాణ తల్లి కోసం నిర్ణయించిన స్థలంలో కాంగ్రెస్ నాయకుల విగ్రహాలు ఏంటని అడిగితే కారుకూతలు కూస్తావా అని నిలదీశారు. తెలంగాణ

మిగతా 2 లో

## 2లక్షల పైన రుణాలవారికి షరతులు వర్తిస్తాయ్

### తేల్చి చెప్పేసిన సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణలో రెండు లక్షల రైతు రుణమాఫీపై మరోసారి క్లారిటీ ఇచ్చారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రెండు లక్షల పైన రుణాలు ఉన్నవారికి షరతులు వర్తిస్తాయని తేల్చి చెప్పారు. అదే సమయంలో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు ఎక్కుపెట్టారు సీఎం రేవంత్. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్‌రెడ్డి సర్కార్ రెండు లక్షల రైతు రుణమాఫీ పథకం అమలు చేసింది. మ్నొత్తం మూడు విడతల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది. అయితే.. రేషన్ కార్డు లేకపోవటం, ఆధార్ కార్డులో తప్పులు, పట్టాదార్ పాస్‌బుక్స్‌లోని పేరుతో సరిగా లేకపోవటం లాంటి కారణాలతో కొందరు

మిగతా 2 లో

# రేట్ల తగ్గింపులో రాష్ట్రాలు అప్రమత్తం

### జీఎస్టీ రేట్ల కోతపై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి కీలక వ్యాఖ్యలు

ప్రజలపై భారం పడకుండా ఆదాయం కోసం చూస్తున్నారు రాష్ట్రాల నుండి కేంద్రం విమర్శలు ఎదుర్కొంటుంది :కేంద్ర ఆర్థిక మంత్రి



న్యూ ఢిల్లీ, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జీఎస్టీ రేట్ల కోతపై తాజాగా కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ స్పందించారు. జీఎస్టీ కౌన్సిల్ లో రేట్ల హేతుబద్ధీకరణపై చర్చలకు ముందు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ, రేట్ల తగ్గింపు విషయంలో రాష్ట్రాలు కూడా అప్రమత్తంగా ఉన్నాయని చెప్పారు. ముందుగా నేను వారిని నిందించడం లేదు. ప్రజలపై భారం పడకుండా ఆదాయం పెంచుకోవాలని వారు భావిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వాల స్థాయిలో వారికి ఆ అధికారం

మిగతా 2 లో



## వరంగల్ చారిత్రక నగరం

### మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలి... రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

వరంగల్ చారిత్రక వారసత్వ నగరం అని, కాకతీయులు పాలించిన సామ్రాజ్యంగా ఈ నగరానికి ఘనమైన చరిత్ర ఉన్నదని, తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. బుధవారం హన్మకొండ జిల్లా కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాలులో హన్మకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. జాతీయ గీతాలాపన అనంతరం హన్మకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో సమావేశం జరిగింది.

హన్మకొండ జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లాకు సంబంధించి విద్య, వైద్య ఆరోగ్య, ఎంజీఎం ఆసుపత్రి, మహిళ, శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్, వ్యవసాయ, ఏనుమాముల వ్యవసాయ మార్కెట్, ఇతర శాఖలతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర గవర్నర్ కు వివరించారు. అనంతరం హన్మకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య జిల్లాలో చారిత్రక దేవాలయాలు, ప్రదేశాలు, పార్కులు, స్మార్ట్ సిటీ, జాతీయ రహదారులు, ట్రాఫిక్

మిగతా 2 లో




## ఫిర్యాదుల పరిష్కార గడువు 30 నుంచి 21రోజులకి కుదించిన కేంద్రం

ఈ మేరకు కేంద్రం కొత్త మార్గదర్శకాలు జారీ

ఫిర్యాదుల నమోదుకు సీపీజీఆర్ ఏఎంఎస్ ప్లాట్ ఫామ్

అన్ని మంత్రిత్వ శాఖలకు నోడల్ ఆఫీసర్లు

కేంద్ర ప్రభుత్వం ప్రజా ఫిర్యాదుల పరిష్కార గడువును 30 రోజులనుంచి 21 రోజులకు కుదించింది. ఫిర్యాదుల పరిష్కారానికి ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్న సందర్భాల్లో, ప్రజలకు మెసేజ్‌ద్వారా విషయాన్ని తెలియజేయాలని నిర్ణయించింది.

న్యూ ఢిల్లీ, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): సింగిల్ విండో ఓపెన్ ప్లాట్‌ఫామ్‌గా పనిచేసే ఇంటిగ్రేటెడ్ యూజర్ ఫ్రెండ్లీ సీపీజీఆర్ఏఎంఎస్ www.pg-portal.gov.inపోర్టల్‌లో ప్రజలు దాఖలు చేసిన ఫిర్యాదులను సమయానుకూలంగా పరిష్కరించేందుకు కేంద్రం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేసింది. అలాగే, పరిష్కరించిన ఫిర్యాదులపై ఫీడ్‌బ్యాక్‌ను ప్రజలకు ఎస్ఎంఎస్, ఈమెయిల్ ద్వారా చేరవేస్తారు. కాల్‌సెంటర్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరిస్తారు. ఒకవేళ ఫిర్యాదుదారుడు సంతృప్తి చెందకపోతే సీనియర్ అధికారికి అప్పీల్


మిగతా 2 లో

## పర్యావరణ వ్యవస్థలో కేంద్రం మరో ముందడుగు

రూ. 28,602 కోట్ల పెట్టుబడితో 10 రాష్ట్రాలను కవర్

12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు కేబినెట్ ఆమోదం

ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీస్‌లో తెలంగాణకు 1, ఆంధ్రకు 2



న్యూ ఢిల్లీ, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): పర్యావరణ వ్యవస్థలో కేంద్రం మరో ముందడుగు. దేశవ్యాప్తంగా 12 పారిశ్రామిక స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పారిశ్రామిక స్మార్ట్ సిటీలను నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్ మెంట్ ప్రోగ్రామ్ కింద నిర్మిస్తోంది. దేశవ్యాప్తంగా 10 రాష్ట్రాల్లో ఈ స్మార్ట్ సిటీలను ఏర్పాటు చేయనున్నారు. 6 ప్రధాన కారిడార్ లతో పాటు వ్యూహాత్మకంగా

మిగతా 2 లో



## తెలంగాణ తల్లి విగ్రహా ప్రతిష్టకు సీఎం భూమి పూజ

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం గొప్పలు చెప్పుకుందని తెలంగాణ తల్లి విగ్రహ ఏర్పాటును మాత్రం తెరమరుగు చేశారని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం ఆయన సెక్రటేరియట్ ప్రాంగణంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్న చోట భూమి పూజకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల తెలంగాణ ఆకాంక్షను సోనియా గాంధీ నెరవేర్చారని తెలిపారు. ఎట్టకేలకు 2014లో ప్రత్యేక రాష్ట్ర కల సాకారమైందని

మిగతా 2 లో



## బెయిల్‌పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

### ఇక నుండి ఇంకా బలంగా పనిచేస్తా, బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటా

హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో బెయిల్‌పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్ పోర్టుకు వచ్చిన ఆమెకు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. అక్కడి నుంచి నేరుగా బంజారాహిల్స్‌లోని ఆమె

మిగతా 2 లో

## వైద్యురాలి హత్యాచార ఘటనపై రాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు

### కొన్ని క్షణాలు భయంతో వణికి పోయాను:రాష్ట్రపతి



న్యూ ఢిల్లీ, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): కోల్‌కతా ట్రైనీ వైద్యురాలి హత్యాచార ఘటన దేశవ్యాప్తంగా సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ భయంకర ఘటనా

మిగతా 2 లో

## త్వరలో హైడ్రా పేరిట ప్రత్యేక చట్టం

### విధివిధానాలు, నిబంధనలపై ప్రభుత్వం కసరత్తు కమిషనర్ రంగనాథ్ వెల్లడి



హైదరాబాద్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): త్వరలో హైడ్రా పేరిట ప్రత్యేక చట్టం రూపొందించనున్నట్లు కమిషనర్ రంగనాథ్ వెల్లడించారు. దీనికి సంబంధించిన విధివిధానాలు, నిబంధనలపై ప్రభుత్వం కసరత్తు చేస్తోందన్నారు. అమల్లోకి వచ్చాక త్వరలోనే హైడ్రా పేరిట స్వయంగా నోటీసులు ఇస్తామన్నారు. హైడ్రా పేరుతో పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేస్తామని, వీటిలో ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఇప్పటివరకు తమ విచారణలో తేలిన అవినీతి అధికారులపై కేసులు నమోదు

మిగతా 2 లో



## రాష్ట్రం నుండి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇద్దరు ఎంపిక

.. వివరాలు 2లో

# సీఎం రేవంత్ రెడ్డిపై కేటీఆర్ మరోసారి ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

ఉద్యమం గుండెల్లో గునపాలు దించిన నీ చేతులతో తెలంగాణ తల్లి విగ్రహం పెట్టినా అది అవమానమే అని విరుచుకుపడ్డారు. గాంధీ విగ్రహం గాడ్సే పెడితే ఎట్లుంటదో అట్లుంటది అని ఎద్దేవా చేశారు. తెలంగాణకు అక్కరకు రాని వాళ్ల బొమ్మలను తొలగిస్తాం అని స్పష్టం చేశారు. ఇదే విషయాన్ని మళ్లీ చెబుతున్నాం రాసి పెట్టుకో అని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లిని సమున్నతంగా ప్రతిష్టిస్తామని స్పష్టం చేశారు. కాగా, బీజేపీలో బీఆర్ఎస్ విలీనం అవుతున్నందుకే ఎమ్మెల్సీ కవితకు బెయిల్ ఇచ్చారని కాంగ్రెస్ నాయకులు చేస్తున్న ఆరోపణలపైనా కేటీఆర్ మండిపడ్డారు. బీఆర్ఎస్‌పై విమర్శలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు ముందు ఈ విషయాలను తమ దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. ఈడీ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ ఇద్దరూ కూడా 2015 డిసెంబర్‌లో బెయిల్ పొందారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇండియా కూటమిలో ఆమ్ ఆద్మీ పార్టీ చేరింది. ఆ పార్టీ నాయకుడు మనీశ్ సిసోడియా వారం కిందట బెయిల్‌కొచ్చారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఓటుకు నోటు కేసులో 2015 నుంచి బెయిల్ మీదే తిరుగుతున్నారు. ఇవన్నీ కూడా కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే జరిగాయని కేటీఆర్ అన్నారు. పై అంశాలను దృష్టిలో పెట్టుకుని బీజేపీ, కాంగ్రెస్ రెండు పార్టీలు కూడా పార్టనర్స్ అని అనుకోవచ్చా? అని ప్రశ్నించారు.

# 2లక్షల పైన రుణాలవారికి షరతులు వర్తిస్తాయ్

**మొదటి పేజీ తరువాయి**

రైతులకు రుణమాఫీ జరగలేదు. అలాగే.. రెండు లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులకు కూడా రుణమాఫీ కాలేదు. దీనిపైనా ఆయా రైతులు ఆందోళన చెందుతున్నారు. అర్హతలు ఉన్నా రుణమాఫీ కాలేదంటూ కొందరు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డెక్కి నిరసనలు తెలుపుతున్నారు. ఈ నేపథ్యంలో.. ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల లోపు రైతు రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలోనే.. రెండు లక్షలకు పైబడిన రుణాలపై స్పష్టత ఇచ్చారు సీఎం రేవంత్‌రెడ్డి. రెండు లక్షలకు పైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తే రుణమాఫీ వర్తిస్తుందన్నారు. అందరికీ రుణమాఫీ జరుగుతుందని స్పష్టం చేశారు. రైతు రుణాలు మాఫీ కాని వారి సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్లలో గ్రీవెన్స్ పెట్టామని చెప్పారు. రుణమాఫీ కానివారి లిస్ట్ కలెక్టరేట్‌లో ఇవ్వాలన్నారు. ఇప్పటివరకు 17వేల 933 కోట్లు జమ చేశామని ప్రకటించారు సీఎం రేవంత్‌రెడ్డి.

ఇక.. మరోవైపు.. కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు ఎక్కుపెట్టారు సీఎం రేవంత్‌రెడ్డి. రుణమాఫీ విషయంలో హరీష్‌రావు సవాల్ చేసి పారిపోయారని విమర్శించారు. రెండు లక్షల రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానని చేయకుండా పారిపోయారని ఆరోపించారు. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ నేతలు లేనిపోని ఆరోపణలు, రైతుల్ని తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రుణమాఫీ కాలేదని చెప్తున్న హరీష్‌రావు, కేటీఆర్ ప్రతి రైతు దగ్గరకు వెళ్లి.. రుణమాఫీ కాని వారి వివరాలు సేకరించలన్నారు. వివరాలు సేకరించి కలెక్టరేట్‌లో ఇవ్వాలని హరీష్‌రావు, కేటీఆర్ సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి.

# బెయిల్‌పై విడుదలైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

**మొదటి పేజీ తరువాయి**

ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా కవిత ఇంటివద్ద మీడియాతో మాట్లాడారు. నేను ఏ తప్పూ చేయలేదు. ఎప్పటికైనా న్యాయం గెలిచి తీరుతుంది. నేను ఎలాంటి తప్పు చేయలేదు కాబట్టి ఏదో ఒక రోజు నిజమేంటతో తెలుస్తుంది. ఆ రోజు వరకు నా పోరాటం ఆగదు. ప్రజా క్షేత్రంలో ఇంకా బలంగా పనిచేస్తా, ఇక నుంచి బీఆర్ఎస్ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటా. ఈ కేసు నుంచి కడిగిన ముత్యంలా బయటపడతా అనే నమ్మకం, విశ్వాసం రెండూ నాకు ఉన్నాయి అని కవిత కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఢిల్లీ లిక్కర్ కేసులో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే. దాదాపు ఐదున్నర నెలల తర్వాత ఈ కేసులో కవితకు ఉపశమనం లభించింది. సుప్రీంకోర్టు బెయిల్ ఉత్తర్వులతో ఆమె తీహార్ జైలు నుంచి మంగళవారం రాత్రే బయటకు వచ్చారు.

# రాష్ట్రం నుండి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇద్దరు ఎంపిక

తెలంగాణ బ్యూరో, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా మొత్తం 50 మంది ఈ జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. కాగా, తెలంగాణ నుంచి మొత్తం ఆరుగురి పేర్లను రాష్ట్ర విద్యాశాఖ ప్రతిపాదించగా ఇందులో ఇద్దరు టీచర్లు ఎంపికయ్యారు. ఈ అవార్డు గ్రహీతల్లో ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండల పాఠశాల ఉపాధ్యాయుడు పెసర ప్రభాకర్ రెడ్డి, సిరిసిల్ల జిల్లా దమ్మన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాద్యాయుడు తండూరి సంపత్ కుమార్ ఎంపికయ్యారు. సంతోష్ కుమార్ తెలంగాణ నుంచి 2021, 2022 జాతీయ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికయ్యాడు. పాఠశాల పటిష్ఠతను పెంపొందించడంలో కీలకపాత్ర పోషించారు. అతని నిరంతర కృషి కారణంగా 2012-13 విద్యా సంవత్సరంలో సంస్థ నమోదు 130 నుంచి 2022-23 నాటికి 215కి పెరిగింది. ఇక స్టేట్ కౌన్సిల్ ఫర్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ తరపున తెలంగాణలోని 10,000 మంది ఉపాధ్యాయులకు ఐసీటి టూల్స్, సీసీఈ, కొత్త పాఠ్యపుస్తకాలు, ఇతర విషయాలపై సంతోష్ ఇన్-సర్వీస్ ట్రైనింగ్ ఇచ్చారు. వీరికి సెప్టెంబర్ 5న ఢిల్లీలో అవార్డులు ప్రదానం చేయనున్నారు.

# పర్యావరణ వ్యవస్థలో కేంద్రం మరో ముందడుగు

**మొదటి పేజీ తరువాయి**

నిర్మిస్తునాన్నారు. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం రూ. 28వేల 602 కోట్లు ఖర్చు చేస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డవలప్ మెంట్ ప్రోగ్రం కింద 12 స్మార్ట్ సిటీలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీలు ఉత్తరాఖండ్ లోని ఖుర్పియా, పంజాబ్ లోని రాజ్పురా పాటియాలా, మహారాష్ట్రలోని డిఘి, కేరళలోని పాలక్కాడ్ , యూపీలో ఆగ్రా, ప్రయాగ్ రాజ్, బీహార్ లోని గయా, తెలంగాణలో జహీరాబాద్, ఏపీలోని ఓర్వకల్, కొప్పర్తి, రాజస్థాన్ లోని జోధ్ పూర్ పాలిలో నిర్మించనున్నారు.

ఈ పారిశ్రామిక హబ్ లలో రూ.1.5లక్షల కోట్ల పెట్టుబడి సామర్థ్యం, ప్రత్యక్షంగా 10 లక్షల మందికి, పరోక్షంగా 30 లక్షల మందికి ఉపాధి అవకాశాలు పొందనున్నట్లు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ చెప్పారు.

# తెలంగాణ తల్లి విగ్రహా ప్రతిష్టకు సీఎం భూమి పూజ

**మొదటి పేజీ తరువాయి**

అన్నారు. తెలంగాణ తల్లి కాకుండా రాష్ట్రానికి వారే సర్వం అన్నట్లుగా కేసీఆర్ కుటుంబం వ్యవహరించిందని ఆక్షేపించారు. ప్రగతి భవన్ పేరుతో గడీని నిర్మించుకుని చుట్టూ కంచెతో పాటు వందలాది పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసి పాలన సాగించారని దుయ్యబట్టారు. నేడు అదే ప్రగతి భవన్‌ను జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం మార్చిందని గుర్తు చేశారు. నేడు ప్రజలకు ఏ సమస్యలు ఉన్నా స్వేచ్ఛగా ప్రజాభవన్ వెళ్లి ఫిర్యాదు అందించే అవకాశం కల్పించామని అన్నారు. వాస్తవానికి భూమి పూజ ఘనంగా చేయాలనుకున్నామని కానీ, విజయదశమి వరకు మంచి రోజులు లేని మూలంగా బుధవారం భూమి పూజ చేయాల్సి వచ్చిందని తెలిపారు. డిసెంబర్ 9న తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించేలా పనులు కొనసాగుతాయని సీఎం రేవంత్ క్లారిటీ ఇచ్చారు.

# కొత్త రేడియో స్టేషన్ల ఏర్పాటుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

**మొదటి పేజీ తరువాయి**

ఉన్న ప్రతిభను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపొందిస్తామన్నారు. ఇందులో భాగంగా తెలంగాణలోని పది నగరాల్లో 30 ఎఫ్ఎమ్ స్టేషన్ల కోసం ఈ-వేలం నిర్వహించేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అందులో ఆదిలాబాద్ 3, కరీంనగర్ 3, ఖమ్మం 3, కొత్తగూడెం 3, మహబూబ్‌నగర్ 3, మంచిర్యాల 3, నల్లగొండ 3, నిజామాబాద్ 3, రామగుండం 3, సూర్యాపేటలో 3 స్టేషన్లు ఉన్నాయి.

# రేట్ల తగ్గింపులో రాష్ట్రాలు కూడా అప్రమత్తం

**మొదటి పేజీ తరువాయి**

ఉంది. వారి విధులు ఒకరిని సంతోష పెట్టడం కాదు. ప్రస్తుతం ఉన్న ఆదాయాన్ని రక్షించడం. ఈ విషయం అందరికీ తెలుసు అంటూ ఆమె ఈ సందర్భంగా విలేకరులతో వ్యాఖ్యానించారు. హేతుబద్ధీకరణ చర్చల్లో భాగంగా వస్తు, సేవలపై రేట్లను పునఃసమీక్షించడానికి కొంత సమయం పడుతుందని ఆమె స్పందించారు. సెప్టెంబర్ 9న జరిగే జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో చర్చ ప్రారంభం కానుంది. కొన్ని నెలలుగా, అధిక జీఎస్టీ రేట్ల పై కేంద్రం విమర్శలను ఎదుర్కొంటున్నది. అయితే ఈ విమర్శలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తిప్పికొట్టారు. ప్రస్తుతం అన్ని వస్తువులు, సేవల రేట్లు జూలై 2017 కంటే తక్కువగా ఉన్నాయని చెప్పారు. అనేక పన్నులు. సెస్ లను కలిపిన తరువాత కొత్త విధానం ప్రారంభమైందని తెలిపారు. ఇంతకంటే మంచి ఏముంటుందని, కేంద్రం ప్రజాకోణంలోనే పని చేస్తుందని ఈ సందర్భంగా ఆమె నొక్కి చెప్పారు. అయితే ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా దుర్మార్గమైన, తప్పుడు ప్రచారం జరుగుతోంది. అలాంటి ప్రచారాలపై నేను స్పందించను. జీఎస్టీ వల్ల దేశం మొత్తం ప్రయోజనం పొందుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం రేట్లతో పాటు, అన్ని రాష్ట్రాల పరిధిలో సరిహద్దు తనిఖీలను తొలగించామని, తద్వారా సరుకుల రవాణా సాఫీగా, వేగంగా సాగుతుందని ఆమె వివరించారు. ఇక 2017లో జీఎస్టీ ప్రారంభానికి ముందు నిపుణుల కమిటీ చెప్పిన ప్రకారం 15.3 శాతంతో పోలిస్తే 2019లో అంచనా వేసిన స్థాయిలో రెవెన్యూ న్యూట్రల్ రేటు ప్రస్తుతం 11.6 శాతానికి పడిపోయిందని ఆమె తెలిపారు. రేట్ల హేతుబద్ధీకరణపై బీహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందం 5%, 12%, 18%, 28% అనే శ్లాబులను యథాతథంగా ఉంచాలని సిఫార్సు చేసింది. అయితే ఈ అభిప్రాయానికి భిన్నంగా రాష్ట్ర ఆర్థిక మంత్రులు, కేంద్రం చాలా మంచి వాతావరణంలో చర్చించనున్నామని పేర్కొన్నారు. చర్చల తర్వాత ఓ ఏకాభిప్రాయ నిర్ణయం తీసుకుంటామని నిర్మలా సీతారామన్




తెలిపారు. లగ్జరీ, తదితర వస్తువులపై పరిహార సెస్ పై కూడా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. సెస్ 2022తో ముగియాల్సి ఉండగా, రాష్ట్రాలు తమ వ్యయ అవసరాలను తీర్చుకోవాల్సిన అవసరం ఉండటంతో రుణాలను తిరిగి చెల్లించడానికి 2026 మార్చి వరకు పొడిగించడానికి జీఎస్టీ కౌన్సిల్ నేరుగా అంగీకరించింది. రూ. 2.7 లక్షల కోట్ల రుణాలను 2025 నవంబర్ నాటికి తిరిగి చెల్లించాలని ప్రభుత్వ అధికారులు భావిస్తున్నారు. అయితే రాష్ట్రాలను సంప్రదించి ఏ నిర్ణయమైనా తీసుకుంటామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ తెలిపారు. సోషల్ మీడియాలో జరుగుతున్న అసత్య ప్రచారాన్ని ఈ సందర్భంగా ఆమె నొక్కి చెప్పారు. అందులోకి వెళ్లదల్చుకోలేదని, కానీ ఒక్క సారి సునిశితంగా పరిశీలించి వ్యాఖ్యలు చేయాలని ఆమె సూచించారు.

# వరంగల్ చారిత్రక నగరం




**మొదటి పేజీ తరువాయి**

క్రమబద్ధీకరణకు, విపత్తుల నిర్వహణ సమయంలో, ఇతరత్రా అంశాల కోసం వినియోగిస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, ప్రతిపాదిక కూరగాయల మార్కెట్, విపత్తుల నిర్వహణ, పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్ ప్లాంట్, కాళోజీ కళాక్షేత్రం, తదితర అంశాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్, తదితర శాఖల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర గవర్నర్ కు జిల్లా కలెక్టర్ వివరించారు. రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ చారిత్రక నగరమైన వరంగల్ లో అనేక చారిత్రక దేవాలయాలు ఉన్న ప్రాంతమని పేర్కొన్నారు. చారిత్రక వారసత్వ నగరమైన వరంగల్ మరింత సుస్థిరాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. వ్యవసాయ రంగంలోనూ జిల్లా ముందుండాలన్నారు. రైతుల ప్రయోజన నిమిత్తం పీఎం కుసుమ్ యోజన పథకం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినదని, ఈ పథకం ద్వారా సౌర విద్యుత్తు ను వినియోగించుకొనేలా అధికారులు రైతుల్లో చైతన్యం కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వేగంగా అభివృద్ధి సాధిస్తుండడం పట్ల తనకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాల అమలు తీరు బాగుందన్నారు. మహిళా స్వయం సహాయక సంఘాల అభివృద్ధి చెందడానికి ఎన్నో సంక్షేమ పథకాలు రాష్ట్రంలో ఉండడం చాలా సంతోషకర మన్నారు. వరంగల్ జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలు అభివృద్ధి లో ముందంజలో ఉండడం చాలా సంతోషకరమని పేర్కొన్నారు. మహిళలు స్వయం సహాయక సంఘాల ద్వారా మరింత ఆర్థిక అభివృద్ధిని సాధించాలన్నారు. నగరంలోని ఆస్పత్రులు ఎంతో పరిశుభ్రంగా ఉన్నాయనే విషయం తెలిసి చాలా సంతోషం కలిగిందన్నారు. చారిత్రక వరంగల్ నగరంలో పర్యటించడం నాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు.

సౌర విద్యుత్ విషయం ప్రస్తావన సమయంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తూ, రైతులకు ఉచిత విద్యుత్తును రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని తెలుపగా గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు. సమావేశం అనంతరం రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శాలువాతో సన్మానించారు. ఈ సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, మండలి వైస్ ఛైర్మన్ బండా ప్రకాష్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ ఛైర్మెన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ బుర్ర వెంకటేశం, ఎమ్మెల్సీలు బస్వరాజ్ సారయ్య, తీన్మార్ మల్లన్న, వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్లు వెంకట్ రెడ్డి, సంధ్యారాణి, హనుమకొండ వరంగల్ జిల్లాల వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

### జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసుకుంటా : గవర్నర్

ములుగు జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో ఒక గ్రామాన్ని త్వరలోనే దత్తత తీసు కుంటానని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో భాగంగా మంగళవారం సాయంత్రం గోవిందరావుపేట మండలం బుస్సాపురం గ్రామంలోని పర్యాటక ప్రాంతమైన లక్నవరానికి చేరుకొని ఆయన బస చేశారు. బుధవారం ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అనంతరం మంత్రి సీతక్క, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంతో కలిసి సరస్సులో గవర్నర్ స్పీడ్ బోటు షికారు చేస్తూ లక్నవరం అందాలను తలకించారు. తాను ఒక గ్రామాన్ని దత్తత తీసుకొని అభివృద్ధి చేస్తానని గవర్నర్ వెల్లడించారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ జిల్లాలో ఓ గ్రామాన్ని దత్తత తీసుకుంటామని గవర్నర్ హామీ ఇవ్వడం చాలా అభినంద నీయ మని అన్నారు. గవర్నర్ పర్యటనకు సహకరించిన కలెక్టర్, పోలీసులు, ప్రజలకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తిరుగు ప్రయాణంలో గవర్నర్ ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖాను సందర్శించి అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అదేవిధంగా విషపురుగు కాటుకు గురైన కానిస్టేబుల్‌ను పరామర్శించారు.







# ఫిర్యాదుల పరిష్కార గడువు 30 నుంచి 21రోజులకి కుదించిన కేంద్రం

**మొదటి పేజీ తరువాయి**

చేసుకోవచ్చు.

**కొత్త మార్గదర్శకాలివే.**

- అన్ని మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో ప్రజా ఫిర్యాదుల కోసం నోడల్ అధికారులను నియమిస్తారు. వారు ప్రజా ఫిర్యాదులను తక్షణమే, నిష్పాక్షికంగా, సమర్థవంతంగా పరిష్కరిస్తారు.
- ఫిర్యాదులు అధికంగా ఉన్న మంత్రిత్వ శాఖలు, శాఖలకు ప్రత్యేక నోడల్ ఆఫీసర్లు ఉండాలి.
- ప్రతి మంత్రిత్వ శాఖలో స్కీమ్స్, కార్యకలాపాలపై అవగాహన, తగిన వనరులతో కూడిన ప్రత్యేక గ్రీవెన్స్ సెల్స్‌ను ఏర్పాటు చేయాలి.
- మంత్రిత్వ శాఖలు, విభాగాల్లో అప్పిలేట్ ఆఫీసర్లు, సబ్ నోడల్ అప్పిలేట్‌ఆఫీసర్ల అంచెలవారీగా నియామక ప్రక్రియను రూపొందించారు.
- ఫిర్యాదుల పరిష్కారం మొత్తం ప్రభుత్వ విధాన పరిధిలోనే ఉంటుంది. తీసుకున్న చర్యలపై నివేదికను రిడ్రెస్సల్ అధికారులు సీపీజీఆర్ఏఎంఎస్‌లో దాఖలు చేయాలి.
- ప్రజా ఫిర్యాదులను ఏఐ ఆధారిత టీ డ్యాష్ బోర్డ్, ఇంటెలిజెంట్ గ్రీవెన్స్ మానిటరింగ్ డ్యాష్ బోర్డును ఉపయోగించి అనలైజ్ చేస్తారు. నెలవారీగా మంత్రిత్వ, విభాగాల ర్యాంకింగ్ కోసం గ్రీవెన్స్ రీడ్రెస్సల్ అసెస్‌మెంట్ ఇండెక్స్‌ను విడుదల చేయాలి.
- సేవోత్తమ్ స్కీమ్ ద్వారా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 36 అడ్మినిస్ట్రేటివ్ ట్రైనింగ్ సంస్థల ద్వారా గ్రీవెన్స్ అధికారులకు సీపీజీఆర్ఏఎంఎస్‌పై శిక్షణ అందిస్తారు.

# వైద్యురాలి హత్యాచార ఘటనపై రాష్ట్రపతి సంచలన వ్యాఖ్యలు

**మొదటి పేజీ తరువాయి**

నన్ను తీవ్రంగా కలచి వేసిందని, కొన్ని క్షణాలు భయంతో వణికి పోయాను అన్నారు. ఇలాంటి ఘటనలు ఇక ముందు జరగకూడదని, మహిళల మీద జరిగే అఘాయిత్యాలపై దేశం మొత్తం మేల్కొని, ఇటవంటి దుర్మార్గాలను ఆపేందుకు ముందుకు రావాలన్నారు. కోల్‌కతా ఘటనపై విద్యార్థులు, సామాన్య ప్రజలు ఓవైపు అదోళనాలు చేస్తూ ఉన్నప్పటికీ.. మరోవైపు మహిళలపై లైంగిక దాడులు యథావిధిగా జరుగుతున్నాయని అన్నారు. మహిళలు ప్రతీ ఒక్క హక్కును పోరాడి సంపాదించుకుంటున్నారని, కొంతమంది సామాజిక కట్టుబాట్లకు, ఆచార పద్ధతులకు భయపడి, మహిళల హక్కుల విషయంలో తమ తలలను నిప్పు కోడిలా దాచుకుంటున్నారని రాష్ట్రపతి ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా దీనిని ఆపాలని హితవు పలికారు.

# త్వరలో హైడ్రా పేరిట ప్రత్యేక చట్టం

**మొదటి పేజీ తరువాయి**

చేస్తామన్నారు. హైదరాబాద్‌లో చెరువులను ఆక్రమించిన వారి గుండెల్లో హైడ్రా దడ పుట్టిస్తోంది. హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీని రాష్ట్ర ప్రభుత్వం జులై 19న ఏర్పాటు చేసింది. హైదరాబాద్ పరిధిలోని చెరువుల సంరక్షణ, విపత్తుల నిర్వహణ, క్రీడా మైదానాలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ వంటివి హైడ్రా బాధ్యతలు. చెరువుల ఎఫ్టీఎల్ లో, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలను ప్రస్తుతం హైడ్రా కూల్చేస్తోంది. హైదరాబాద్ మహానగరంలో చెరువులు, కుంటల ఆక్రమణలపై హైడ్రాకు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. బుద్ధభవన్‌లోని హైడ్రా కార్యాలయానికి మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో ఫిర్యాదు దారులు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు క్యూ కడుతున్నారు. దీంతో హైడ్రా కార్యాలయానికి రోజు రోజుకీ తాకిడి పెరుగుతోంది. మొదట్లో పదుల సంఖ్యలో వచ్చిన ఫిర్యాదులు.. హైడ్రా కఠిన చర్యలతో వందల్లోకి చేరాయి. వాటన్నింటినీ స్వీకరిస్తున్న కార్యాలయ సిబ్బంది అందులోని వివరాలను నమోదు చేసుకుంటూ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తున్నారు. మరోవైపు ఫిర్యాదుదారుల తాకిడి పెరగడంతో హైడ్రా కార్యాలయం వద్ద పోలీసు బందోబస్తు పెంచారు.

తీన్మార్
తెలుగు దినపత్రిక

# కరి మింగిన వెలగపండే 'యూపీఎస్'

కరి మింగిన వెలగపండే 'యూపీఎస్'మసిపూసి మారేడుకాయ చేయడంలో మోడీకి మించిన వారు లేరని పదేండ్ల నుండి రుజువవుతూనే ఉంది. ఇందుకు మరో తాజా ఉదాహరణే సోమనాథన్ కమిటీ సిఫార్సు చేసిన యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్). చూడటానికి నున్నగా కనిపిస్తున్నా కరిమింగిన వెలగపండు చందమే ఈ స్కీమ్. ముప్పై ఏండ్లు వివిధ ప్రభుత్వ విభాగాల్లో సేవలందించి, పదవీ విరమణ తర్వాత వారి జీవితానికి, కుటుంబానికి ఓ భరోసానే పెన్షన్. ఈ పెన్షన్ పొందడం వారి హక్కే కానీ, భిక్ష కాదని సుప్రీంకోర్టు ఏనాడో తేల్చి చెప్పింది. అన్నీ ఇస్తామంటూనే ఉద్యోగి నుండి వాటా అడుగుతున్నారు. అందుకే ఈ ఏకీకృత పెన్షన్ పథకాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ విధానంలోని అనేక అంశాల్లో అసలు స్పష్టతే లేదు. ఉద్యోగుల భాగస్వామ్య వాటా ఎందుకు? ఈ స్కీం భవిష్యత్‌లో మరిన్ని సమస్యలు సృష్టించడం ఖాయం.

వాస్తవానికి 2004 ముందు వరకు ఓపీఎస్ (ఓల్డ్ పెన్షన్ స్కీం) అమల్లో ఉండేది. దీన్ని ట్రిబుల్ బెన్‌ఫిట్స్ సిస్టమ్ అనేవారు. అంటే కచ్చితమైన పెన్షన్, పీఎఫ్, గ్రాడ్యూటీ.. ఈ మూడూ పదవీ విరమణ పొందిన ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి వర్తించేవి. ఉద్యోగుల నుండి ఒక్క రూపాయి కూడా తీసుకునేవారు కాదు. అయితే ప్రపంచ బ్యాంకు ఆదేశాల మేరకు వాజ్‌పేయి నాయకత్వంలోని అప్పటి ఎన్డీయే ప్రభుత్వం జవనరి, 2004 నుంచి జాతీయ పెన్షన్ విధానం తీసుకొచ్చింది. ఈ విధానం తర్వాత సర్వీస్‌లో ఉన్నప్పుడే పెన్షన్ ఫండ్ కోసం ఉద్యోగి నుండి పది శాతం, యాజమాన్యం నుండి పది శాతం తీసుకొని షేర్‌మార్కెట్లో పెట్టడం మొదలుపెట్టారు. మార్కెట్ హెచ్చు తగ్గులను బట్టి ఉద్యోగి రిటైర్ అయినపుడు, చనిపోయినపుడు ఎంత అయితే అతని అకౌంట్లో ఉంటుందో అందులో అరవై శాతం చేతికిస్తారు. మిగిలింది మ్యూచ్‌వల్ ఫండ్స్ వలె కొనుక్కోవాలి. అయితే ఇందులో పెన్షన్ ఎంత వస్తుందో స్పష్టత ఉండదు. మార్కెట్‌ను బట్టి మారిపోతూ ఉంటుంది. 2004 తర్వాత ఉద్యోగాల్లో చేరిన వారందరికీ ఈ విధానం అమల్లో ఉంది. ఈ విధానానికి వ్యతిరేకంగా ఓపీఎస్ అమలు చేయాలని ఏండ్లుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు చేస్తున్న పోరాటానికి తలొగ్గి 2023, మార్చిలో బీజేపీ ప్రభుత్వం సోమనాథన్ కమిటీని నియమిం చింది. ఏడాది తర్వాత దీని సిఫారసుల మేరకు యూనిఫైడ్ పెన్షన్స్ స్కీంను 2024 ఆగస్టు 24న కేంద్ర క్యాబినెట్ ఆమోదిం చింది. దీని ప్రకారం పెన్షన్ కమ్యూటేషన్, కనీసం ఐదేండ్లకు ఓసారి పెన్షన్ సవరణ, టాక్స్ బెనిఫిట్స్, 70 ఏండ్ల పైబడిన వారికి అదనపు పెన్షన్ అంటూ అనేక అంశాలు వివరించారు. షేర్‌మార్కెట్‌పై ఆధారపడ కుండా ఫిక్స్‌డ్‌గా కొంత పెన్షన్ కూడా ఇస్తామంటున్నారు.

ఇవన్నీ వినడానికి పాత పెన్షన్ వలె పైకి కనబడుతున్నా ఉద్యోగి భాగస్వామ్యం మాత్రం అలాగే కొనసాగుతుంది. అలాగే ఓపీఎస్ కింద ఇరవైయేండ్ల సర్వీసుంటే పూర్తి పెన్షన్ వచ్చేది. యూపీఎస్‌లో దాన్ని పాతికేండ్లు చేశారు. దీనివల్ల పెన్షన్‌కు అర్హత పొందే వారి సంఖ్యే తగ్గిపోయే అవకాముంది. పైగా ఉద్యోగి సర్వీస్‌లో ఉన్నన్ని రోజులు పెన్షన్ ఫండ్ మొత్తం షేర్‌మార్కెట్లోనే పెడతారు. అంటే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం షేర్ మార్కెట్‌కు నిధులు సమకూర్చటమే. ఈ పథ కంలో భాగంగా ప్రభుత్వం తన వాటాను మరో నాలుగున్నర శాతం పెంచింది. జూలై 31 నాటికి ఎన్‌పీఎస్ కింద ఉన్న 99,77,165 మంది ఉద్యోగులకు చెందిన రూ. 10,53,850 కోట్ల పెన్షన్ నిధులను షేర్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టడానికే బీజేపీ ఈ నిర్ణయం తీసుకుందనేది స్పష్టం. ప్రభుత్వానికి ఉద్యోగుల బాగుకన్నా కార్పొరేట్ల అవసరాలే ముఖ్యమని దీన్ని బట్టి అర్థమవుతోంది. ఈ విధానంలో చెప్పిన పదవీ విరమణ సమయంలో చెల్లించే మొత్తం, అదనపు పెన్షన్, ఆరోగ్య కార్డులు, భవిష్యత్తులో సవరణలు, పన్ను ప్రయోజనలు వంటి అంశాలపై అసలు స్పష్టతే లేదు. త్వరలో జమ్మూకాశ్మీర్, హర్యానాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత కీలకమైన మహారాష్ట్ర, జార?ండ్, బీహార్‌లలో వరుసగా ఎన్నికలున్నాయి. ఎన్నికల్లో ప్రధాన అంశంగా పాత పెన్షన్ పునరుద్ధరణను కాంగ్రెస్ ఎంచుకున్నది. అందుకే బీజేపీ ఈ స్కీమును హడావిడిగా ఆమోదించింది. ఈ స్కీమును జాతీయ ట్రేడ్ యూనియన్లలో బిఎంఎస్ తప్ప మిగిలిన అన్ని సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. కేంద్రం యూపీఎస్‌ను తెరపైకి తెచ్చి ఉద్యోగులను తప్పుదోవ పట్టిస్తోందని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగుల సంస్థ 'ది నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీమ్' ఈ పాటికే ప్రకటించింది. ఏది ఏమైనా ఈ పెన్షన్ పథకం ఉద్యోగులను ఏమారుస్తోందనేది స్పష్టం. ఇలాంటి మసిపూసి మారేడుకాయ చేసే పనులకు కేంద్రం పూనుకోవడం మానాలి. ఉద్యోగులు మరోసారి మోసపోవడానికి సిద్ధంగా లేరు. అందుకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు పాత పెన్షన్ విధానం కోసం తమ ఉద్యమాన్ని కొనసాగించేందుకు సిద్ధమవుతున్నారు.

# అమరచింత లో విద్యుత్ అమరవీరుల వర్ధంతి

**విద్యుత్ అమరవీరుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి**

**సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎస్ గోపి**



అమరచింత, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలో విద్యుత్ అమరవీరుల వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేడుకలు భాగంగా వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి జిఎస్ గోపి పార్టీ మండల నాయకులు వెంకటేష్ రమేష్ అజయ్ మాట్లాడుతూ 2000 సంవత్సరం ఆగస్టు 28న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలపై కరెంటు చార్జీలు తగ్గించాలని హైదరాబాద్ చలో అసెంబ్లీ సందర్భంగా బషీర్బాగ్ దగ్గర శాంతియుతంగా కరెంటు చార్జీలు తగ్గించాలని ధర్నా నిర్వహిస్తున్న ప్రజలపై అమానుషంగా పోలీసులు గుర్రాలతో తొక్కించి లాటరీ చార్జి మరియు పోలీసులు జరిపిన కాల్పుల్లో కామ్రేడ్ విష్ణువర్ధన్ కామ్రేడ్ బాలస్వామి కామిరెడ్డి రామకృష్ణ తుపాకీ గుండ్లకు నేలకు వరి ఆనాటి నుండి 24 సంవత్సరాలవుతుంది ప్రభుత్వాలు విద్యుత్ చార్జీలు పెంచాలని ప్రయత్నం చేస్తే విద్యుత్ పోరాటం గుర్తు చేసుకోవాలని అప్పటి ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు చార్జీలు పెంచితే సమర్థించడం జరిగింది. కావున ప్రజలు తిప్పి కొట్టారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు శ్యాంసుందర్ బుచ్చన్న రాఘవేంద్ర తిరుమలి శీను రాము వెంకటేష్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# డెంగీ జ్వరంతో యువకుడు మృతి

గరిడేపల్లి, ఆగస్టు 28 ( తీన్మార్ న్యూస్): గరిడేపల్లి మండల కేంద్రంలోని పరెడ్డిగూడెం గ్రామానికి చెందిన దోసపాటి మహేష్ అనే (29 సంవత్సరాలు) వయస్సు కలిగిన యువకుడు గత వారం రోజుల నుంచి తీవ్ర జ్వరంతో బాధపడుతూ ఉండగా ఆతని కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట జిల్లా హెడ్ క్వార్టర్స్ లోని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడి నుండి మెరుగైన వైద్యం కోసం హైదరాబాదులోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స జరుగుతుండగా నిన్న ఉదయం 6 గంటల సమయంలో మృతి చెందడం బాధాకరం అని కుటుంబ సభ్యులు తెలియజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన దోసపాటి మహేష్ కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. మహేష్ చనిపోయిన వార్త తెలియడంతో కుటుంబ సభ్యులు పరెడ్డిగూడేం గ్రామ ప్రజలు నాయకులు బంధువులు తోటి మిత్రులు ఆవేదనతో తీవ్ర దిగ్భ్రాంతి కి గురి అయ్యారు.



# మంచినీటి సౌకర్యం కల్పించాలని అధికారులకు వినతి పత్రం ఇచ్చిన కల్మెట్ ప్రజలు

**త్రాగడానికి మంచినీళ్లు లేక అలమటిస్తున్న గ్రామ ప్రజలు**

**మా మంచి నీటి కష్టాలు తీర్చేది ఎవరు**



పాలకవీడు, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): జాన్ పహాడ్ దర్గా గ్రామపంచాయతీ కల్మెట్ తండాలో మంచినీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నామని వెంటనే మంచినీటి సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని పాలకవీడు మండల రెవెన్యూ అధికారులకు కల్మెట్ తండా గ్రామస్తులు వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన వర్షాలు లేక భూగర్భ జలాలు లేక ఉన్న బోర్లు ఎండిపోయాయని త్రాగడానికి మంచినీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని అదే విధంగా కోమటికుంట చెరువుకు నీళ్లు వదలాలని ఎక్కువ నీళ్లు వదిలితే చెరువు నుంచి కల్మెట్ తండా చెక్ డ్యామ్ కు వస్తాయన్నారు. దాని ద్వారా నీరు భూగర్భ జలాలు వచ్చి బోర్లు నడుస్తాయన్నారు. అదేవిధంగా ఎన్ని బోర్లు వేసిన మంచినీళ్లు పడడం లేదని మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సహకారంతో కృష్ణానది నుంచి ప్రత్యేక పైపులైను ఏర్పాటు చేసి మంచినీటి సౌకర్యాన్ని కల్పించాలని శాశ్వతంగా మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరినారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాణావత్ వెంకటి నాయక్ కెలావత్ మధు నాయక్ బుక్య నాగరాజు రాజశేఖర్ నాయక్ వెంకటేశ్వర్లు నాయక్ సైదా నాయక్ రాజా నాయక్ చంద్రు నాయక్ రవి నాయక్ ఆర్ పి నాయక్ బాలచంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

# హుజూర్నగర్ నియోజకవర్గంలో బీజేపీ అత్యధిక సభ్యత్వాలు చేయాలి

**చల్ల శ్రీలతరెడ్డి**



పాలకవీడు, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): పాలకవీడు మండల కేంద్రంలో మండల అధ్యక్షుడు విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి భారతీయ జనతా పార్టీ మండల సభ్యత్వ నమోదు కార్యక్రమ వర్క్ షాప్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన దిశా నిర్దేశం చేసినా బిజెపి రాష్ట్ర నాయకురాలు, బిజెపి సభ్యత్వ సూర్యాపేట జిల్లా కన్వీనర్ చల్ల శ్రీలతరెడ్డి శ్రీలతరెడ్డి మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటివారం నుండి అక్టోబర్ 15వ తేదీ వరకు తెలంగాణ రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. భారతీయ జనతా పార్టీ నాయకులు అందరూ సమన్వయంతో పనిచేసి పాలకవీడు మండలంలో అధిక సంఖ్యలో సభ్యత్వాలు చేయాలన్నారు. 100 సభ్యత్వాలు చేసిన వారికే క్రియాశీల సభ్యత్వం వస్తుందని క్రియాశీలక సభ్యత్వం వచ్చిన వారికే మండల, జిల్లా స్థాయిలో పదవులు వస్తాయని కాబట్టి ప్రతి ఒక్కరూ ప్రతి పోలింగ్ బూత్ లో సభ్యత్వాలు చేయాలన్నారు. ఈ సందర్భంగా పాలకవీడు మండల బిజెపి సభ్యత్వ ఇన్చార్జిలుగా రమావత్ నరినాయక్, కొత్తూరు వేంకటేశ్వర్లు, కాటూరి శేషగిరిరావు లను నియమించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కార్యవర్గ సభ్యులు కొత్తూరు వెంకటేశ్వర్లు, పాలకవీడు మండల ప్రధాన కార్యదర్శి మంద లాజర్, గ్రామ అధ్యక్షుడు కొండ శ్రీను, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు లంజపల్లి నాగరాజు, మల్లికంటి నాగరాజు, బిజెపి నాయకులు కాట కృష్ణారెడ్డి, నాగేశ్వరావు, కుందూరు మట్టారెడ్డి, గంగుల సైదులు, విద్యాసాగర్, ఉపేంద్రచారీ, ఉట్ల నాగేశ్వర్రావు, రామావత్ సైదానాయక్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ మాత నూతన ఆలయ ప్రారంభోత్సవం

**♦ కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంఛార్జీ తోటకూర వజ్రేషా యాదవ్**



జవహర్ నగర్, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): భక్తిశ్రద్ధలతోనే మానసిక ప్రశాంతతా కలుగుతుందని, పోచమ్మతల్లి దీవెనలు ప్రజలందరిపై ఉండాలని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇంఛార్జీ తోటకూర వజ్రేష్యాదవ్ అన్నారు. జవహర్నగర్ కార్పొరేషన్లోని 12వ డివిజన్లో నూతనంగా నిర్మించిన పోచమ్మతల్లి ఆలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్టపానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా వదిలేసి యాదవ్ హాజరై మాట్లాడుతూ పోచమ్మతల్లి అనుగ్రహంతో వర్షాలు సమృద్ధిగా వడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ శాంతి, కార్పొరేటర్ సతీష్ కుమార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంతాయాదవ్, బల్లి శ్రీను, సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభ



ఆత్మకూరు, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో విద్యుత్ అమరవీరుల సంస్కరణ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఎస్ రాజు విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆనాటి విద్యుత్ పోరాటంలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో టిడిపి ప్రభుత్వం జరిపినటువంటి వాసవిక కాల్పుల్లో కామ్రేడ్ విష్ణువర్ధన్ రెడ్డి బాలస్వామి రామకృష్ణులు పోలీస్ తూటాలకు ఎదురోడి ప్రాణాలు అర్పించడం జరిగింది. వారి యొక్క స్ఫూర్తిని స్మరించకుండా భవిష్యత్తులో యువత ఉద్యమంలోకి రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆనాడు జరిగినటువంటి పోరాట ఫలితంగా ఇప్పటివరకు విద్యుత్ ఛార్జీలు పెంచలేదని ఇది ప్రజా ఉద్యమాల ఫలితం అని ఆ పోరాట వలసత్వాన్ని కొనసాగించాలని ఎస్ రాజు పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవి ప్రకాష్, ఇస్మాయిల్, కృపాదానం కార్మికులు, కర్షకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచమ్మ తొట్టె కార్యక్రమం



దేవరకద్ర,ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): పోషమ్మ పండుగ సందర్భంగా తొట్టె కార్యక్రమం నిర్వహించారు. వనపర్తి జిల్లా మదనాపురం మండలం దంతనూరు గ్రామంలో పోచమ్మ పండుగ తొట్టె కార్యక్రమం గ్రామస్తులందరూ ఊరేగింపుగా సంబరాలు చేసుకుంటూ పోచమ్మ గుడి దగ్గర తోటే కార్యక్రమం ముగించింది. ఈ కార్యక్రమంలో ప్రవీణ్ కుమార్ రెడ్డి చీర్ల శ్రీనివాసులు జమ్ములు చుక్కకృష్ణ మాధవరెడ్డి వెంకటన్న నాగరాజుగౌడ్ నాగన్న రవి మైభు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మండలానికి మక్తల్ ఎమ్మెల్యే రాక



అమరచింత, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా అమరచింత మండల కేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి మరియు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మక్తల్ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి మరియు టిపిసిసి అధికార ప్రతినిధి కల్లుగీత సెల్ రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ విచ్చేయనున్నారు. కావున ఇట్టి కార్యక్రమానికి మండల పట్టణ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అమరచింత కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కేజీ.మహేందర్రెడ్డి, అమరచింత పట్టణ అధ్యక్షులు ఎస్ఎం.అరుణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# ఆర్టీసీ బస్సును ఢీ కొన్న ద్విచక్ర వాహనం



వనపర్తి నియోజకవర్గం, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డిపల్లి గ్రామ స్టేజ్ వద్ద బుధవారం సాయంత్రం వనపర్తి డిపోకి చెందిన (TS 32 T 5577 ) ఆర్టిసి బస్సు పామిరెడ్డిపల్లి పల్లి గ్రామానికి చెందిన బోయ అశోక్, బోయ చందు (TS 07 EF 4528) ద్విచక్ర వాహనంపై వనపర్తికి వెళుతుండగా, ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అతివేగంతో వెళుతున్న ద్విచక్ర వాహనం వల్లే ఈ ప్రమాదం జరిగిందని అక్కడున్న ప్రజలు తెలిపారు.వివరాలు తెలియాల్సి ఉంది అని మండల ఏస్.ఐ శివకుమార్ తెలిపారు.

# సంగం డైరీ ముందు ఉద్రిక్తత

నల్లగొండ: మిర్యాలగూడ మండలం, శ్రీనివాసనగర్ లోని సంగం డైరీ వద్ద ఉద్రిక్తత నెలకొంది. డైరీ ప్రారంభోత్సవాన్ని పాడి రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో డైరీ సిబ్బందికి పాడి రైతులకు మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో విటి డైరీ గా ఉన్న సంస్థను బకాయిలు పడ్డ నేపథ్యంలో.. బ్యాంక్ అధికారులు సంఘం డైరీకి విక్రయించారు. నేడు నూతన యాజమాన్యం డైరీని ప్రారంభించేందుకు సన్నద్ధం కాగా.. తమకు పాత బకాయిలు చెల్లించాలంటూ రైతులు ఆందోళనకు దిగారు. బ్యాంక్ అధికారులు, సంఘం డైరీ యాజమాన్యం కుమ్మక్కై.. దొడ్డిదారిలో డైరీ ఫార్మ్ ను చేజిక్కించుకున్నారని ఆరోపించారు.

# మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్



మహబూబాబాద్ జిల్లా, ఆగస్ట్ 28 (తీన్మార్ న్యూస్): మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఇందిరా మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డి.ఆర్.డి.ఎ, సెర్ఫ్ అధికారులతో మహిళా శక్తి కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పోతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే ఇందిరా మహిళా శక్తి పథకం ముఖ్య ఉద్దేశమని, ఈ పథకాన్ని జిల్లాలో దిగ్విజయంగా అమలు చేయాలని సూచించారు. స్వయం సహాయ సంఘాల ద్వారా పలు రకాల సూక్ష్మ పరిశ్రమలు, వ్యాపారాలను ప్రోత్సహించి సంఘాలలో సభ్యులుగా ఉన్న మహిళల ఆర్థిక స్వావలంబనకు సహకరించడం, మహిళల సామాజిక భద్రత కోణంలో సంఘాలను బలోపేతం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకొందన్నారు. మహిళలు వ్యాపారం ప్రారంభించే ముందు తమ వద్ద ఉత్పత్తి అయ్యే వస్తువుల మార్కెటింగ్ పై అవగాహన పెంచుకోవాలన్నారు. వ్యాపార రుణాలు సకాలంలో చెల్లించాలన్నారు. డిమాండ్ ప్రతిపాదికన ఏర్పాటు చేస్తే ప్రయోజనకరంగా ఉంటుందని తెలిపారు. జిల్లాలో వివిధ మండలాలలో ఏర్పాటు చేసే మహిళా క్యా%శీ%టీన్ లను ప్రజల అవసరాలకు అనుగుణంగా చేపట్టాలని అన్నారు. ప్రజా రవాణా ఉన్నటువంటి స్థలాలలో, రద్దీ గల స్థలాలలో మహిళా క్యాంటీన్ ఏర్పాట్లు చేసేందుకు చొరవ తీసుకొంటే బాగుంటుందని, అదే విధంగా ఏర్పాట్లు పూర్తి చేసిన మహిళా క్యాంటీన్ లను ప్రారంభానికి సిద్దం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం పౌల్ట్రీ ఫారాలు, పాడి పశువుల యూనిట్లు, కోళ్ల ఫారాలు, మిల్క్ పార్లర్లు, చేపల విక్రయ కేంద్రాలు,మైక్రో ఎంటర్ప్రైజెస్, స్టిచ్చింగ్ సెంటర్, మీసేవ, ఈవెంట్ మేనేజ్మెంట్, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్మెంట్ యూనిట్ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్, కష్టం హైరింగ్ సెంటర్ వంటి 13 యూనిట్లను స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసుకొనుటకు ఈ సెక్టార్లలో జీవనోపాధి కల్పించుటకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు డి.ఆర్.డి.ఏ జయశ్రీ, డి.పి.ఎం లు నళిని,శ్రీనివాస్, రాజు మెప్మా అధికారి విజయ, ఈ.డి.యం ప్రశాంత్ పాల్గొన్నారు.

# జిల్లా ఏరియా ఆస్పత్రిని సందర్శించిన రాష్ట్ర గవర్నర్



ములుగు జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ములుగు జిల్లాలో రెండు రోజుల పర్యటన అనంతరం తిరుగు ప్రయాణంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , రాష్ట్ర పంచాయితి రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ, గ్రామీణ నీటి సరఫరా శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క తో కలిసి జిల్లా కేంద్రం లోని ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ కి ఆస్పత్రిలో పేషంట్ లకు అందిస్తున్న వైద్య సేవల గురించి అధికారులు వివరించారు. స్వయంగా రాష్ట్ర గవర్నర్, మంత్రి సీతక్క రోగులను అందుతున్న సేవలగురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం పేషంట్ లకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ బి వెంకటేశం, జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఎస్పీ శబరీష్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ జగదీశ్వర్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మోహన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.

# టార్గెట్ బాల్ రెఫరీగా ఎంపికైన గిరిజన బిడ్డ

## గుగులోతు నగేష్ నాయక్



గరిడేపల్లి, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 1వరకు రాయచోట్ లోని అర్చన కాలేజ్ అన్నమయ్య జిల్లా ఆంధ్రప్రదేశ్ లో జరిగే సెకండ్ సౌత్ జోన్ టార్గెట్ బాల్ రెఫరీగా సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం గారకుంట తండా గ్రామానికి చెందిన గుగులోతు నగేష్ నాయక్ ఎంపిక అయినట్లు తెలంగాణ రాష్ట్ర టార్గెట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వినోద్ కుమార్ రెడ్డి ప్రధాన కార్యదర్శి రేవంత్ ఒక ప్రకటనలో తెలిపారు. గుగులోతునగేష్ నాయక్ తెలంగాణ రాష్ట్రం నుంచి ఎంపిక అవ్వడం పట్ల మాజీ సర్పంచ్ బాబు నాయక్ ,సైదా నాయక్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు సందీప్ నాయక్, రమేష్ నాయక్, జేఎల్ఎం సైదా నాయక్, బిక్షం నాయక్ అభినందిచారు. అదేవిధంగాగిరిజన బిడ్డ జాతీయ స్థాయి రిఫరీగా ఎంపిక అవ్వడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

# విద్యాదానం మహా గొప్పది

## అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): విద్యాదానం మహా గొప్పదని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం అదనపు కలెక్టర్ అధ్యక్షతన తన ఛాంబర్ లో జిల్లా గ్రంధాలయ సంస్థ జయశంకర్ భూపాలపల్లి సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం అయిన అభ్యర్థులు వారి వద్ద నిరుపయోగంగా ఉన్న పుస్తకాలు గ్రంధాలయానికి వితరణ చేయాలని సూచించారు. వితరణ చేయడం వల్ల పోటీ పరీక్షలకు సన్నదం అవుతున్న నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి ఉపయోగ పడతాయని తెలిపారు. అలాగే పదవి విరమణ చేసిన ఉద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, వివిధ హోదాలలో ఉన్న వ్యక్తులు వారి వద్ద ఉన్న పోటీ పరీక్షలకు ఉపయోగ పడే పుస్తకాలు పేదలకు ఉపయోగానికి గ్రంధాలయాలకు ఇవ్వాలని తెలిపారు. ఇచ్చిన పుస్తకాలు గ్రంధాలయ రిజిస్టర్ లో నమోదులు చేయాలని కార్యదర్శిని ఆదేశించారు. గ్రూప్ 1, 2, 4 పోటీ పరీక్షలకు సన్నదం అవుతున్న విద్యార్థులకు ఇన్స్పిరేషన్ గా ఉండేందుకు అనుభవం, అవగాహన ఉన్న ప్రముఖులతో విద్యార్థులకు మోటివేషనల్ తరగతులు ఏర్పాటు చేయాలని తెలిపారు. ఇలాంటి సెమినార్స్ నిర్వహణ వల్ల అభ్యర్థులకు పోటీ పరీక్షలలో విజయం నసాదించడానికి కావాల్సిన మెలకువలు తెలుసుకోవడానికి అవకాశం కలుగుతుందని అన్నారు. గ్రంధాలయాల్లో ఉన్న అన్ని పుస్తకాల వివరాలు అందచేయాలని తెలిపారు. గ్రామ పంచాయతీ ల్లో నూతన రీడింగ్ రూములు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా 12 అంశాలను కమిటీ ఆమోదించినట్లు అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సమావేశంలో గ్రంధాలయ కార్యదర్శి టి శ్రీలత, డిపిఓ నారాయణ రావు, డిపిఆర్వో శ్రీనివాస్, విద్యాశాఖ సహాయ కార్యదర్శి భద్రయ్య, లైబ్రేరియన్ చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

# రణరంగంగా మారిన కోల్ కత్తా

కోల్ కత్తా: పశ్చిమ బెంగాల్ కోల్కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన మమత ప్రభుత్వాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈ ఘటనపై నిరసనలు మరింత ఉధృతమయ్యాయి. దీనికి రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, పలు రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ.. విద్యార్థి సంఘాలు మంగళవారం సెక్రటేరియట్ను ముట్టడికి పిలుపునిచ్చాయి.. కోలక్కతాలో 'పశ్చిమబంగా ఛాత్రో సమాజ్' పెద్ద ఎత్తున నిరసన చేపట్టింది. 'నబన్నా అభియాన్' పేరుతో విద్యార్థులు భారీ ర్యాలీని చేపట్టారు. సెక్రటేరియట్ను ముట్టడి నేపథ్యంలో విద్యార్థులకు, పోలీసులకు మధ్య పలు చోట్ల ఘర్షణ చెలరేగింది. విద్యార్థులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. మార్చ్లో పాల్గొన్న ఆందోళనకారులు.. బారికేడ్లను బద్దలుకొట్టేందుకు ప్రయత్నించారు. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. దీంతో పోలీసులు వారిపై బాష్పవాయువు ప్రయోగించారు. లాఠీఛార్జ్ చేయడంతోపాటు గాల్లోకి కాల్పులు జరిపారు. ప్రస్తుతం అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ఆందోళనకు ఎలాంటి అనుమతి లేదని పోలీసులు చెబుతున్నారు. హింసకు పాల్పడితే సహించేది లేదని పేర్కొంటున్నారు. కాగా.. ఆందోళనకారులు రాళ్లు రువ్వడంతో పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. పోలీసులు లాఠీఛార్జ్ చేసినప్పటికి , భాష్పవాయువు ప్రయోగించినప్పటికి ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. హౌరా బ్రిడ్జి దగ్గర బైఠాయించారు. ప్రస్తుతం హౌరా బ్రిడ్జిపై విద్యార్థులు ధర్నా కొనసాగిస్తున్నారు.. లాఠీఛార్జ్లో పలువురు విద్యార్థులకు గాయాలైనట్లు పేర్కొంటున్నారు. భారీ ఆందోళనల నేపథ్యంలో సీఎం మమతా బెనర్జీ నివాసం వద్ద భారీగా బలగాలను మోహరించారు. విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కోల్కతాలో హై టెన్షన్ నెలకొంది.. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థినిపై హత్యచారం కేసు దర్యాప్తును సీబీఐ ముమ్మరం చేసింది.. ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో ఆగస్టు 9న వైద్య విద్యార్థినిపై అత్యాచారం, హత్య జరిగింది.. ఈ కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్కు లై డిటెక్టర్ పరీక్షలు సైతం నిర్వహించారు. ఇప్పటివరకు ఆర్జీ కర్ ఆస్పత్రి మాజీ ప్రిన్సిపల్ సందీప్ఘోష్తో సహా ఆరుగురికి పాలిగ్రాఫ్ టెస్ట్లు నిర్వహించి వివరాలు సేకరించారు.

# నీటిపారుదల, పౌరసరఫరాల శాఖల మంత్రి పర్యటనకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్



కన్నాయిగూడెం, ఆగస్టు 28 (తీన్మార్ న్యూస్): 30వ తేదీ ములుగు జిల్లాలో నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పర్యటన కు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. కన్నాయిగూడెం మండలంలోని దేవాదుల ఇంటెక్ వెల్ పంప్ హౌస్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నీటిపారుదల శాఖ మంత్రి పర్యటన నేపథ్యంలో హెలిపాడ్, రహదారి, రివ్యూ సమావేశ ఏర్పాట్లను పూర్తి చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. అనంతరం తుపాకులగూడెం గ్రామంలోని ఆశ్రమ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని -1 తనిఖీ చేసి విద్యార్థులతో మాట్లాడారు. అంగన్వాడి చిన్నారులకు, పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ విజయభాస్కర్ , ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జగదీష్, డి ఈ ప్రవీణ్, శరత్, తహసిల్దార్ సలీం, ఎం పిఓ, తదితరులు పాల్గొన్నారు.

# ఖాతాదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలి

## – షేక్ అబ్దుల్ రహీం భారతీయ స్టేట్ బ్యాంకు రీజినల్ మేనేజర్



గోవిందరావుపేట : ఖాతాదారులతో బ్యాంకు సిబ్బంది గౌరవంగా మర్యాదపూర్వకంగా మసలుకోవాలని భారతీయ స్టేట్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ షేక్ అబ్దుల్ రహీం అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని భారతీయ స్టేట్ బ్యాంక్ ఆవరణలో ఖాతాదారుల ఫిర్యాదుల పరిష్కారార్థం బ్యాంకు మేనేజర్ సూర్య ప్రకాష్ రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్ ఎం షేక్ అబ్దుల్ రహీం మాట్లాడారు. ముందుగా ఖాతాదారుల ఫిర్యాదులను బ్యాంకులో పడుతున్న సాధక బాధకాలను వరుస క్రమంలో ఒక్కొక్కరిని అడిగి తెలుసుకుని తిరిగి అదే క్రమంలో పరిష్కారం దిశగా సమాధానాలు ఇచ్చి ఖాతాదారులను సంతృప్తి పరిచారు. రుణమాఫీ విషయంలో పలువురు రైతులు ఖాతాదారుల సమస్యలకు పరిష్కారం దిశగా తన వంతు ప్రయత్నిస్తానని అన్నారు. ఇకపై బ్యాంకులో ఖాతాదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తవని తాను సభ పూర్వకంగా హామీ ఇస్తున్నానని, ఎలాంటి సమస్యలు తలెత్తిన తనకు ఫిర్యాదు చేస్తే వెంటనే చర్యలు ఉంటాయని అన్నారు. అదేవిధంగా బ్యాంకు సిబ్బందికి కూడా ఖాతాదారుల పట్ల ఎలా నడుచుకోవాలో వందల మంది ఖాతాదారులు మరియు నూతన ఖాతా కొరకు లోను కొరకు వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా నిదానంగా వారి సమస్యను పరిష్కరించే దిశగా సమాధానం ఇవ్వాలి కానీ అసహ్యించుకోవడం ఈసరించుకోవడం వంటి చర్యలకు పాల్పడకూడదని అన్నారు.

మనం ఎంతసేపు సర్వీస్ జోన్లో ఉన్నామన్న విషయాన్ని గుర్తుంచుకొని విధి నిర్వహణలో ఉండాలని అన్నారు. ఈ తరహా సంఘటనలు ఇకపై బ్యాంకులో పునరావృతం కావని అన్నారు. రుణమాఫీ మెసేజ్ వచ్చిన ఖాతాదారుల సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని అన్నారు. కొత్తలోనుకు దరఖాస్తు చేసుకున్న వారికి 48 గంటల్లో కొత్త వ్యవసాయ రుణాలు అందిస్తామని, బ్యాంకు ఆభరణాలపై లోను తీసుకునేవారు మరియు వ్యవసాయ పంటలపై రుణాలు తీసుకునే రైతులు వారికి చేతనయినంతలో ఇన్సూరెన్స్ చేయించుకోవాలని ఆ పద్ధతులను బ్యాంకు అధికారులు వివరిస్తారని దానివల్ల ఎంతో ప్రయోజనం ఉంటుందని అన్నారు. ఏదైనా అనుకోని సంఘటన జరిగితే కుటుంబానికి మన ఇన్సూరెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుంది అన్న విషయాన్ని ఖాతాదారులు గ్రహించాలని సూచించారు. ఇకపై ఎలాంటి సంఘటనలకు తావు లేకుండా స్నేహపూర్వక వాతావరణంలో బ్యాంకు లావాదేవీలను రైతులు ఖాతాదారులు ఒకరు ఒకరు పరస్పర సహకారంతో అభివృద్ధి పథంలో ముందుకు పోదామని అన్నారు. ఆర్ ఎం రహీం సమాధానాలతో ఖాతాదారులు సంతృప్తి చెందడంతో పాటు తెలియదు ఎన్నో రకాల సమస్యలను తెలియపరచినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ లక్ష్మణ్ , అగ్రికల్చర్ ఆఫీసర్ జితేందర్ రెడ్డి మరియు అగ్రికల్చర్ అధికారులు రుణమాఫీ కానీ రైతులు ఖాతాదారులు పాల్గొన్నారు.

# సీజనల్ జ్వరాల వ్యాప్తి కట్టడికి పటిష్ట చర్యలు

**-జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**-నీరు నిల్వ ఉండటం వల్ల వచ్చే ప్రమాదాలపై విస్తృత ప్రచారం**

**-పరిసరాల అపరిశుభ్రత కారణంగానే విషజ్వరాలు వ్యాప్తి**

**-మంథని మండలంలోని గుంజపడుగు గ్రామంలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్**



మంథని: గ్రామాలలో సీజనల్ జ్వరాల వ్యాప్తి కట్టడి చేసేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మంథని మండలం గుంజపడుగు గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. గుంజపడుగు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, వైరల్ జ్వరాలకు గురైన గ్రామస్థుల ఇండ్లను పరిశీలించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ వర్షాకాలంలో నిల్వ ఉన్న నీటిలో దోమలు వ్యాప్తి చెంది వైరల్ జ్వరాలు, డెంగ్యూ, మల్లేరియా చికెన్ గున్యా మొదలగు జ్వరాల వ్యాప్తి దారి తీస్తాయని, ఇండ్లలో ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, పరిసరాల పరిశుభ్రత ద్వారా మాత్రమే వైరల్ జ్వరాల ను అరికట్టవచ్చని కలెక్టర్ తెలిపారు. వైరల్ జ్వరాలు వచ్చిన ఇండ్లలో నీరు నిల్వ ఉండటం గమనించిన కలెక్టర్ వెంటనే నిల్వ చేసిన నీటిని , ఆ స్థలాన్ని శుభ్రం చేయించారు. నీరు నిల్వ ఉండటం వల్ల వచ్చే ప్రమాదాలపై గ్రామంలో విస్తృతంగా ప్రచారం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై కూడా ఎక్కడ నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ ఉన్న పక్షంలో దోమలు రాకుండా ఆయిల్ బాల్స్ వినియోగించాలని అన్నారు. గ్రామంలో రెగ్యులర్ గా ఫాగ్గింగ్ చేయాలని కలెక్టర్ సూచించారు. పరిసరాల అపరిశుభ్రత కారణంగా డెంగ్యూ, మల్లేరియా మొదలగు వైరల్ జ్వరాల వ్యాప్తి పెరిగి ప్రజల ఆరోగ్యం దెబ్బ తింటుందని అన్నారు.

ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా పంచాయతీ అధికారి ఆశ లత, డివిజనల్ పంచాయతీ అధికారి సతీష్ మంథని మండల పరిషత్ అభివృద్ధి అధికారి పూర్ణ చందర్ రావు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారి సంతాప సభ..



రెంజల్ : రెంజల్ మండలం దూపల్లి గ్రామంలో 2000 సంవత్సరంలో విద్యుత్ పోరాటంలో అమరులైన విష్ణువర్ధన్ రెడ్డి, రామకృష్ణ, బాల స్వాములకు సీపీఐ (ఎం ఎల్) మాస్ లైన్ ప్రజా పంత ఆధ్వర్యంలో సంతాప సభను నిర్వహించారు. మాస్ లైన్ సహాయ కార్యదర్శి ఎస్కె నసీర్ మాట్లాడుతూ నేటికి 24 సంవత్సరాలు ఆనాటి చంద్రబాబు నాయుడు ఆయన ప్రపంచ ఏజెంట్గా మారి సామాన్య ప్రజానీకంపై విద్యుత్ చార్జీలను పెంచగా వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకులు దానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయగా పోలీసుల లాఠీ చార్జీలలో పై వరు అమరులయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చడంలో విఫలమయ్యిందని, హామీలు నెరవేర్చలేని ఎడల తాము పెద్ద ఎత్తున ఆందోళన చేపడతమని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్కె నశీర్, కే గంగాధర్ జిల్లా నాయకులు, మల్లేష్ డివిజన్ నాయకులు, ఎల్ గంగాధర్, పసుల గోపాల్, సిద్ధ పోశెట్టి, దేవన్న గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలోని పత్తినంతా కొనుగోలు చేయాలి..

## కేంద్రానికి మంత్రులు లేఖ

రాష్ట్రంలో పత్తి సాగు, ఉత్పత్తి పెరగడంతో పాటు రైతులకు ఆర్థిక భరోసా కలిగేలా నూతన వంగడాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత తెలిపారు.



రాష్ట్రంలో రైతుల దగ్గర పత్తి కొనుగోలు చేస్తేనే సెస్ తొలగిస్తామని పత్తి స్పిన్నింగ్, జిన్నింగ్ వ్యాపారులకు మంత్రులు స్పష్టం చేశారు. పత్తి రైతుల దగ్గర మొత్తం పంట కొనుగోలు చేసేలా సీసీఎల్?కు, కేంద్రానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు. బుధవారం సచివాలయంలో పత్తిలో వ్యర్థాల తొలగింపు, రైతులకు అధిక ధర లభ్యంపై జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లరు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత సమావేశమయ్యారు. పత్తిలో వ్యర్థాల వల్ల ధర తగ్గుముఖంపై రాష్ట్ర చేనేత, జౌళి శాఖ ముఖ్యకార్యదర్శి కె.సునీత పవర్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, రాష్ట్రంలో 2017-18లో 20.50 లక్షల బేళ్ల పత్తి ఉత్పత్తి జరగ్గా.. 2023-24లో 11.58 లక్షల బేళ్ల ఉత్పత్తికి తగ్గిపోయిందన్నారు. ప్లాస్టిక్, గోనె సంచుల్లో పత్తిని ప్యాకింగ్ చేయడం వల్ల జిన్నింగ్ సమయంలో వ్యర్థాలు బయట పడుతున్నాయన్నారు. దీనివల్ల పత్తి నాణ్యత దెబ్బతినడంతో పాటు ధర కూడా తగ్గుతోందని, దీనివల్ల రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు. పత్తి సేకరణ సమయంలో కాటన్ సంచులు వాడకం వల్ల ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పడే అవకాశం ఉండదన్నారు. ఇందుకు వ్యవసాయ శాఖాధికారులు రైతుల్లో అవగాహన కల్పించాలని మంత్రి సవిత సూచించారు.

వంద శాతం ఈ క్రాప్ తో పత్తి రైతులకు మేలు: మంత్రి అచ్చెన్నాయుడు

ఈ క్రాప్?లో తప్పనిసరిగా పత్తి రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ క్రాప్ లో నమోదు చేసిన పంటనంతా సీసీఐ కొనుగోలు చేయాలని ఆ సంస్థ ప్రతినిధికి స్పష్టం చేశారు. అదే సమయంలో ఈ క్రాప్ లో నమోదు వల్ల ప్రభుత్వం అందించే ఫలాలతో లబ్ధిపొందొచ్చునని రైతులకు అవగాహన కల్పించాలన్నారు. అంతిమంగా రైతులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి వెల్లడించారు. పత్తి దిగుడులు పెంపుదల, వ్యర్థాల నివారణపై మహారాష్ట్ర, తెలంగాణలో పరిస్థితులు అధ్యయనం చేసి తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. పత్తి సేకరణలో ప్లాస్టిక్ వినియోగంపై నివారణకు జిన్నింగ్, స్పిన్నింగ్ మిల్లర్లు ముందుకు రావాలన్నారు. ప్లాస్టిక్ సంచుల్లో వచ్చే పత్తిని కొనుగోలు చేయబోమని రైతులకు తేల్చి చెప్పాలన్నారు. పత్తి రైతుల శ్రేయస్సు కోసం ముఖ్యమంత్రి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందన్నారు. పత్తి సాగులో అధిక ఉత్పత్తికి మేలైన వంగడాలు రూపొందించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయం విద్యాలయం శాస్త్రవేత్తలకు మంత్రి సూచించారు.

# రేషన్ కార్డు లేని వారికి రుణమాఫీ

**- గ్రామాల వారీగా కుటుంబాల నిర్ధారణ**

మల్హర్ రావు: రేషన్ కార్డు లేని రైతులకు రుణమాఫీ వర్తించేలా గ్రామాల వారీగా బుధవారం నుంచి కుటుంబాల నిర్ధారణ చేయాలని ప్రభుత్వం సూచించింది. రుణమాఫీ సమస్యలపై మంగళవారం రైతునేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో సమావేశంలో ఉన్నతాధికారులు మార్గదర్శకాల గురించి వివరించారు. రూ. 2 లక్షల లోపు పంట రుణం ఉండి రేషన్ కార్డు లేక రుణమాఫీ పొందని కుటుంబాలను గుర్తించి ప్రత్యేక యాప్లో నమోదు చేయాలని వారు సూచించారు. బ్యాంకులను ప్రాతిపదికన తీసుకొని ఇప్పటి వరకు రుణమాఫీ పొందని జాబితాను అధికారులకు అందజేసిన యాప్ లో వివరాలు పొందు పరిచారు. ఆయా రైతుల వివరాలను గుర్తించి వారి కుటుంబాన్ని నిర్ధారణ చేసుకొని యాప్లో నమోదు చేయనున్నారు. ఇందులో భాగంగా రైతు నుంచి స్వీయ ధ్రువీకరణ తీసుకోనున్నారు. మండలంలో ఇప్పటి వరకు మూడు విడతల్లో రుణమాఫీ జరిగింది. తెల్లరేషన్ కార్డు ఉండి, అన్ని వివరాలు సక్రమంగా ఉన్న వారికి రూ. 2 లక్షల మేరకు మాఫీ సొమ్ము జమైంది. తాజాగా రూ. 2 లక్షల్లోపు ఉండి రేషన్ కార్డు లేని రైతులను గుర్తించి, కుటుంబ వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదించనున్నారు. ఇందుకు మండలాల వారీగా నోడల్ అధికారులను ప్రత్యేకంగా నియమించారు. గ్రామాల వారీగా రూపొందించిన జాబితాలో పేర్లు



ఉన్న రైతులకు ఒక రోజు ముందుగానే సంబంధిత వ్యవసాయ సిబ్బంది సమాచారాన్ని చేరవేస్తారు. ఆ రోజు నోడల్ అధికారి గ్రామాన్ని సందర్శించి రైతుల వారీగా వివరాలు పరిశీలించి నిర్ధారించు కుంటారు. రైతులు అందు బాటులో ఉండి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. వీరితోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతాలు తప్పుగా నమోదు చేసుకోవడంతో రుణమాఫీ రాని రైతులు అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

# ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలి

**- భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

మల్హర్ రావు: ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా నిష్పక్షపాతంగా పూర్తి చేయాలని భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. బుధవారం కాటారం మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న ఎల్ ఆర్ ఎస్ ప్రక్రియను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొన్నారు. సర్వే నంబర్ 16, కంభం మధుకర్ స్థలంలో జరుగుతున్న ప్రక్రియ ఆన్లైన్ చేయు విదానాన్ని పరిశీలించారు. గిర్దావర్, ఇరిగేషన్, ఎంపీవోలు నమోదు చేసిన తదుపరి ఆన్లైన్ లో అదనపు కలెక్టర్ పరిశీలనకు వస్తాయని, అదనపు కలెక్టర్ పరిశీలన ఆమోదం తదుపరి కలెక్టర్ ఆమోదించాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. స్థలానికి నాలుగు ప్రక్కల హద్దులు ఆన్లైన్ నమోదు చేసిన తదుపరి ఎంత మొత్తం చెల్లించాలో ధర నిర్ణయించబడుతుందని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన ధర ప్రకారం చెల్లింపు చేయాల్సి ఉంటుందని, తదుపరి



చెల్లింపు ప్రక్రియ జరగగానే ఆన్లైన్ ద్వారానే క్రమబద్ధీకరణ జరుగుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఆర్ అండ్ బి విశ్రాంతి భవనంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ఏర్పాటును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఆర్డిఓ మంగిలాల్, డిపిఓ నారాయణ రావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపిఓ వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రైల్వే అంశాలు రాజకీయాలకు అతీతం: అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: ఇటీవల వరుసగా చోటుచేసుకున్న రైల్వే ప్రమాదాలపై కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ స్పందించారు. రైల్వేలను రాజకీయాలకు అతీతంగా ఉంచాలన్నారు. కొన్ని ఘటనల్లో కలవరపెట్టే అంశాలు వెలుగులోకి వచ్చాయని వెల్లడించారు. బుధవారం ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. 'రైల్వే ప్రమాదాలు అనేది చాలా సున్నితమైన విషయం. కొన్ని ఘటనల్లో కలవరపెట్టే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. అటువంటి అంశాలను తీవ్రంగా పరిగణించాలి. అన్ని ఘటనలపై రైల్వేశాఖ విచారణ చేస్తోంది. అదేవిధంగా రైల్వే అంశాలను రాజకీయాలకు అతీతంగా ఉంచాలి. దేశ జీవనాధారానికి ఏదైన ప్రతికూలతలు ఉంటే అందరం కలిసి నిలబడాలి. రైల్వే సమర్థవంతంగా పనిచేసేందుకు కృషి చేయాలి' అని ఆయన పేర్కొన్నారు.

ఇటీవల అహ్మదాబాద్ వెళ్తున్న సబర్మతి ఎక్స్‌ప్రెస్ రైలు కాన్పూర్-భీమ్‌సేన్ రైల్వే స్టేషన్ల వద్ద తక్కువ వేగంతో వెళ్తున్నప్పుడు 20 పెట్టెలు పట్టాలు తప్పాయి. అయితే పట్టాలపై ఉన్న పెద్ద బండరాయి వంటిదాన్ని రైలు ఢీకొనడంతో ప్రమాదం జరిగిందని అధికారులు తెలిపారు. ఇక, మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్ డివిజన్‌లోని రైల్వే స్టేషన్‌కు సమీపంలో



రైలు ఇనుప రాడ్డును ఢీకొన్న ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదాలపై విచారణ కొనసాగుతోంది.

# ఐదు నెలల తర్వాత తిరిగొచ్చిన కవితకు ఘనస్వాగతం

హైదరాబాద్: ఐదు నెలల తర్వాత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్నారు. కుటుంబసభ్యులు కేటీఆర్, భర్త అనిల్ కుమార్, కుమారుడు ఆదిత్యతో కలిసి మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయల్దేరిన కవిత.. సాయంత్రం 5 గంటల సమయంలో హైదరాబాద్‌కు చేరుకున్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కవితకు బీఆర్ఎస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఢిల్లీ లిక్కర్ కేసులో కవితకు బెయిల్ రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం నెలకొంది. గులాబీ కార్యకర్తలతో ఎయిర్‌పోర్టు ప్రాంగణమంతా సందడిగా మారింది. కవితపై పార్టీ కార్యకర్తలు పూలవర్షం కురిపించారు. బోకేలు ఇచ్చేందుకు కార్యకర్తలు, అభిమానులు పోటీ పడ్డారు. తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారిని చూసిన కవిత పిడికిలి బిగించి జై తెలంగాణ అంటూ నినాదాలు చేశారు. బీఆర్ఎస్ శ్రేణులకు అభివాదం చేశారు. విమానాశ్రయం నుంచి బంజారాహిల్స్‌లోని నివాసానికి కవిత వెళ్లారు. కవితను చూసేందుకు ఆమె నివాసానికి తల్లి శోభ, కేటీఆర్ సతీమణి శైలిమ, ఇతర కుటుంబ సభ్యులు చేరుకున్నారు. నివాసం వద్దకు రాగానే బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. టపాసులు పేల్చి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తనకు స్వాగతం పలికేందుకు వచ్చిన వారందరికీ కవిత ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీ లిక్కర్ కేసులో తాను కడిగిన ముత్యంలా బయటపడతానని చెప్పారు. ధర్మం, న్యాయం గెలుస్తుందని అన్నారు. నిజం కోసం కేసీఆర్ నాయకత్వంలో పోరాటం కొనసాగిస్తామ న్నారు. కాగా, తన తల్లికి పాదాభివందనం చేసిన కవిత.. తన సోదరుడు కేటీఆర్‌కు రాఖీ కట్టారు. కాగా, గురువారం మధ్యాహ్నం కవిత ఎర్రవల్లిలోని కేసీఆర్ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లనున్నారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టైన ఎమ్మెల్సీ కవిత 164 రోజుల తర్వాత జైలు నుంచి విడుదల



య్యారు. ఈడీ, సీబీఐ కేసుల్లో కవితకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేయడంతో తీహార్ జైలు నుంచి బయటకు వచ్చారు. సుప్రీంకోర్టు నిర్దేశించిన పూచీకత్తును కవిత భర్త అనిల్ కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మంగళవారం రౌస్ అవెన్యూ కోర్టులో సమర్పించారు. వాటిని అంగీకరించిన రౌస్ అవెన్యూ కోర్టు కవిత విడుదలకు అనుమతిస్తూ తీహార్ జైలుకు వారెంట్ జారీ చేసింది. కవిత ఉదయం రౌస్ ఎవెన్యూ కోర్టులో జరిగిన విచారణకు వర్చువల్‌గా హాజరయ్యారు. సీబీఐ దాఖలు చేసిన చార్జ్ షీట్‌పై విచారణ జరగ్గా, కొన్ని పత్రాలు సరిగ్గా లేవని, కోర్టు రికార్డుల నుంచి స్పష్టంగా ఉన్న దస్త్రాలను ఇవ్వాలని నిందితుల తరఫు న్యాయ వాదులు కోరారు. సెప్టెంబర్ 4 లోపు డిఫెన్స్ లాయర్లు అడుగుతున్న డాక్యుమెంట్స్‌ను అందించాలని జడ్జి కావేరి భవేజా కోర్టు అధికారులకు సూచిస్తూ.. విచారణను సెప్టెంబర్ 11వ తేదీకి వాయిదా వేశారు. కవిత విడుదలతో బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. హైదరాబాద్ నగరంలో కవితకు స్వాగతం పలుకుతూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు.

# కాటారం కలెక్టర్ విస్తృతంగా పర్యటన

**- కస్తూరిబ్బా పాఠశాల తనిఖీ**

మల్హర్ రావు: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ బుధవారం కాటారం మండలంలో విస్తృతంగా పర్యటించారు. యూత్ ట్రైనింగ్ కేంద్రం, కెజిబివి పాఠశాల, గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో పాఠాలు చదివించి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు తరచూ వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఏదేని అత్యవసర సేవలకు జిల్లా కేంద్రంలోని 100 పడకల ఆసుపత్రికి తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ఆరోగ్యం బాగా లేక ఇండ్లకు వెళ్లిన విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని వాకబు చేయాలని సూచించారు. సంక్షేమ వసతి గృహల్లో సోలార్ హీటర్లు, ఆర్ ఓ ప్లాంట్స్ ఏర్పాటుకు మండల ప్రత్యేక అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపాలని సూచించారు. వినియోగానికి పనికిరాకుండా నిరుపయోగంగా ఉన్న వస్తువులను తొలగించాలని ఆదేశించారు. గిరిజన రెసిడెన్షియల్ పాఠశాలల్లో డార్మెటరి అప్పగించకపోవడం వల్ల విద్యార్థులు ఆరుబయట భోజనం చేయాల్సి వస్తుందని తక్షణమే డార్మెటరి అప్పగించు విదంగా చర్యలు తీసుకోవాలని గిరిజన సంక్షేమ శాఖ డిడిని ఆదేశించారు. అదేవిధంగా యూత్ ట్రైనింగ్ కేంద్రం నిర్వహణ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. భవనం నిర్వహణ లోపం వల్ల నిరుపయోగంగా ఉందని, వినియోగంలోకి తేవాలని వారం రోజుల్లో పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించి ముస్తాబు చేయాలని ఆదేశించారు. గిరిజన సంక్షేమ శాఖ డిడి ఒక్క



సమావేశానికి కూడా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కేజీబివి పాఠశాలల్లో చేపట్టిన మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. వంట సామాన్లు భద్రపరచు గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు అందించాలని తెలిపారు. నిత్యావసర సరుకులు సకాలంలో సరఫరా జరుగుతుందా లేదా అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిపిఓ.నారాయణరావు, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, ఆర్డిఓ మంగిలాల్, తహసీల్దార్ నాగరాజు కళశాలల ప్రిన్సిపాల్స్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలి

**ఏసీబీ విజయ్ కుమార్**

ధర్మసాగర్: సైబర్ నేరాలపైన, వాటి సెక్యూరిటీలపైన కూడా పరిజ్ఞానం ఉండే విధంగా ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండాలని సైబర్ సెక్యూరిటీ ఏసీపీ విజయ్ కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో చిన్న విజ్ఞాన వేదిక సహకారంతో సైబర్ సెక్యూరిటీపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళి అధ్యక్షతన కార్యశాల నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుతం విద్యార్థులు డిజిటల్ యుగంలో ఉన్నారని తెలిపారు. ఆన్లైన్లో ఎక్కువ సమయం గడుపుతూ సైబర్ మోసాలకు, బెదిరింపులకు గురవుతున్నారని ఆరోపించారు. అందుకే ఆన్లైన్లో ఎలా గోప్యతను నిర్వహించుకోవాలో, బాధ్యతాయుతమైన డిజిటల్ పౌరసత్వం కోసం శాస్త్ర సాంకేతికాలను ఆకలింపు చేసుకునేందుకు ప్రతి విద్యార్థిని విద్యార్థులు సైబర్ సెక్యూరిటీ అంశాలను క్షుణ్ణంగా తెలుసుకోవాల




న్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా తల్లిదండ్రులకు వృద్ధులకు వివరించే విధంగా దృష్టి సారించి వాటిని అరికట్టాలన్నారు. అనంతరం జన విజ్ఞాన వేదిక హనుమకొండ జిల్లా అధ్యక్షులు విశ్రాంత అటవీశాఖ అధికారి పురుషోత్తం విద్యార్థుల్లో పర్యావరణ స్పృహ పెంచేందుకు పర్యావరణ పరిరక్షణ విషయాలు తెలుపుతూ విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# జన విజ్ఞాన వేదికతో సైన్స్ స్వావలంబన

**మండల అధ్యక్షుడు కొక్కుల శ్రీధర్**

పెద్దవంగర: సమాజంలో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం తో పాటుగా, సైన్స్ స్వావలంబన కోసం జన విజ్ఞాన వేదిక నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం పెద్దవంగర మండల నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కొక్కుల శ్రీధర్ అన్నారు. మండల నూతన కమిటీని ఇస్రో సైంటిస్ట్ వంశీకృష్ణ, జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి లింగంపల్లి దయానంద్, చిర్ర యాకాంతం గౌడ్ సమక్షం లో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం సైన్స్ అనే ఉన్నతమైన ఆశయాలతో జనవిజ్ఞాన వేదిక పనిచేస్తుందన్నారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్నటువంటి మూఢ విశ్వాసలను పారద్రోలడం కోసం నిర్విరామంగా కృషి చేస్తామని చెప్పారు. ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి, ప్రజల కోసం సైన్స్, ప్రగతి కోసం సైన్స్ పాటుపడుతుదని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యల మౌలిక స్వరూప స్వభావాలను గుర్తిస్తూ, సవివరమైన శాస్త్రీయ



ప్రాతిపదికతన విశ్లేషిస్తూ సమగ్రమైన అవగాహన కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెప్పారు. కాగా మండల ప్రధాన కార్యదర్శిగా కవిరాజ్ కుమార్, కోశాధికారిగా మహ్మద్ యాకుబ్, ఉపాధ్యక్షులుగా యుగేందర్, రమేష్ కుమార్, వల్లపు సంధ్యా రాణి, సంయుక్త కార్యదర్శిగా బొమ్మెర ఎల్లా గౌడ్, గాంధారి సింహాద్రి, చెకుముకి కన్వీనర్ గా బోగా సురేంద్ర కుమార్, సమతా కన్వీనర్‌గా స్రవంతిలు ఎన్నికయ్యారు.

# అనురాగ్ యూనివర్సిటీ ముందు విద్యార్థి సంఘం ఆందోళన

మేడ్చల్: ఘట్ కేసర్ మండలం వెంకటాపూర్ లోని పల్ల రాజేశ్వర్ రెడ్డి కి చెందిన అనురాగ్ యూనివర్సిటీ ముందు ఏఐఎస్ఎఫ్ ఆందోళనకు దిగింది. ఎఫ్టిఎల్, బఫర్ జోన్ లని, ఆక్రమించి అనురాగ్ యూనివర్సిటీ మెడికల్ కళాశాల నిర్మించిన పళ్ళ రాజేశ్వర్ రెడ్డి పై చర్యలు చేపట్టాలంటూ ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు యూనివర్సిటీ ముందు ధర్నా నిర్వహించారు.

టిఆర్ఎస్ ప్రభుత్వంలో అధికారాన్ని అడ్డుపెట్టుకొని గవర్నమెంట్ ల్యాండ్ ఆక్రమించి యూనివర్సిటీని నిర్మించడమే కాకుండా, మెడికల్ కళాశాలను నాదం చెరువు యొక్క ఎఫ్టిఎల్, బఫర్ జోన్ల ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టి అధికార దుర్వినియోగానికి పాల్పడిన పల్లా రాజేశ్వర్ రెడ్డిని తక్షణమే అరెస్టు చేయాలని ప్రభుత్వాన్ని, హైడ్రాను ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులను పోచారం ఐటి కారిడార్ పోలీసులు అరెస్టు చేసి పోచారం పోలీస్ స్టేషన్ కి తరలించారు...

# దళితుల్లో కులగనన చేపట్టిన తర్వాతే ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

**ఎస్సీ ఉపకులాలను మాల,మాదిగ కులాలతో కలపొద్దు**

**దళితుల్లో అత్యంత వెనుకబడ్డ ఉపకులాలను "ఏ" వర్గంలో చేర్చి 5 శాతం రిజర్వేషన్స్ కేటాయించాలి**

**ఉపకులాలకు అన్యాయం చేస్తే మరోపోరాటానికి సిద్ధం**

**ఎస్సీ వర్గీకరణ అమలుపై విధి విధానాలు రూపొందించుటకు వెంటనే రిటైర్డ్ జడ్జితో కమిషన్ ను ఏర్పాటు చేయాలి**

**ఉపకులాల కార్పొరేషన్ ను వెంటనే ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలి**

**ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు రాయిల లక్ష్మి నర్సయ్య చిందు డిమాండ్**

జగిత్యాల: కులగనన చేసిన తరువాతే శాస్త్రియంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని , ఉపకులాలకు అన్యాయం చేయాలని చూస్తే మరో పోరాటానికి సిద్దమని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి ఉపాధ్యక్షులు రాయిల లక్ష్మి నర్సయ్య చిందు అన్నారు..ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు బైరి వెంకటేశం ఆదేశాల మేరకు మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగలు, ఉపకులాల సుధీర్ఘ పోరాటం వల్లే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని వెంటనే ఎస్సీ వర్గీకరణ ను అమలుచేస్తానని అసెంబ్లీలో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి తరపున కృతజ్ఞతలు తెలుపుతూ సుప్రీం కోర్టు చెప్పిన విధంగా అన్నీ రంగాలలో దళితుల్లో అన్యాయానికి గురైన కులాల పక్కా సమాచారం తీసుకున్న తరువాతే వర్గీకరణ చేయాలని సూచించింది కాబట్టి దళితుల్లో కులగనన చేపట్టిన తర్వాతే శాస్త్రియంగా ఎస్సీ వర్గీకరణ చేయాలని ఇందుకోసం వెంటనే రిటైర్డ్ జడ్జ్ తో ప్రత్యేక కమిషన్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. వర్గీకరణ డిమాండ్ తెరమీదకు వచ్చిందే ఉపకులాలకు అన్యాయం జరుగుతుంది కాబట్టి వారి వాటా వారికి దక్కడం కోసం..కానీ గత ఉమ్మడి రాష్ట్రం లో అమలుజరిగిన ఎస్సీ వర్గీకరణ వల్ల మాల, మాదిగ గ్రూపులలో చేర్చబడిన ఉపకులాలు అన్ని రంగాలలో తీవ్రంగా నష్టపోయారని గతంలో ఏర్పాటు చేసిన రామచంద్ర రాజు, ఉషామేహరా, లోకూర్ కమిషన్లు స్పష్టంగా తెలుపుతూ ఉపకులాల అభివృద్ధి కోసం ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వలకు నివేదికలిచ్చారన్నారు. సుధీర్ఘ పోరాటం తరువాత ఉపకులాలకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు పచ్చ జండా ఊపిందని, కొంతమంది చేసే తప్పుడు ప్రచారాన్ని, రాజకీయ వొత్తిడిని పట్టించుకోకుండా, దళితుల్లో కులగనన చేపట్టి ఇన్నేళ్లుగా అభివృద్ధి ఫలాలకు దూరమైన ఈ కులాలకు సామాజిక వెనుకబాటు తనం ఆధారంగా రిజర్వేషన్ వాటా కేటాయించి శాస్త్రియంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలన్నారు...మన రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారం మొత్తం 59 దళిత కులాల జనాభా 63 లక్షలు కాగా అందులో మాల ,మాదిగ కాకుండా మిగిలిన 57 ఉపకులాల వాస్తవ జనాభా సుమారు ముప్పై లక్షలవరకు ఉంటుందని, గతంలో జరిగిన జనాభా జనాభా లెక్కల్లో ఉపకులాల వారిగా కాకుండా కేవలం ఎస్సీలుగా మాత్రమే లక్షలాది మంది ఉపకులాలను లెక్కించ్చారని. ఉపకులాలకు కులధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో ద్వారా ఇస్తుండడం వల్ల అనేక ఇబ్బందులకు గురై విధిలేక వీరు మాల, మాదిగ కుల పత్రాలను పొందడం వల్ల మాల మాదిగ కుల జనాభా పెరిగిందని కాబట్టి వెంటనే ఉపకులాలందరికి కులపత్రాలను ఆర్డీవో పరిధినుండి తొలగించి తహసీల్దార్ ద్వారా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య శాశ్వత పరిష్కారనికి దళితుల్లో ప్రత్యేక ఆంత్రోపాలాజికల్ సర్వే నిర్వహించి ఎవరికులానికి చెందిన కులస్థులకు వారి కులపత్రాలు ఇవ్వాలని అన్నారు. అనంతరం కులగనన చేపట్టి ఎవరి వాటా వారికి దక్కేలా కృషి చేయాలన్నారు. కాగా కొంతమంది మాల మాదిగ కులాలే అధికంగా ఉండి మిగతా కులాలు ఒక్కశాతం కూడా లేరనే తప్పుడు ప్రచారం చేస్తూ ఎస్సీ వర్గీకరణ అంశం కేవలం మాల మాదిగల పంచాయతీగా చిత్రికరించి మిగతా 57 ఉపకులాలను అణిచివేసే కుట్ర జరుగుతుందన్నారు. గత ఎన్నికల్లో ఎస్సీ ఉపకులాల పోరాటాన్ని ఆనాటి పీసీసీ అధ్యక్షులు నేటి మన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో లో మాల, మాదిగలతో పాటు ఎస్సీ ఉపకులాలకు కూడా మూడు ప్రత్యేక కార్పొరేషన్ లు ఏర్పాటు చేస్తామని ప్రకటిస్తే మొన్నటి అసెంబ్లీ బడ్జెట్ ప్రసంగంలో మాల మాదిగలకు కార్పొరేషన్లను ప్రకటించి ఉపకులాల కార్పొరేషన్ ను విస్మరించడం ఎవరి కుట్రనో తేల్చలన్నారు. ఇప్పటికైనా ఎస్సీ ఉపకులాల కార్పొరేషన్ ను వెంటనే ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సజావుగా అమలుచేయుటకు, విధివిధానాలు ఖరారు చేయుటకు వెంటనే రిటైర్డ్ జడ్జి తో కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి నాయకులు జిల్లా నాయకులు గడ్డం మధు చిందు తదితరులు పాల్గొన్నారు.

## కుటుంబ కలహాల నేపధ్యంలో ఆత్మహత్యాయత్నం

భద్రాద్రి కొత్తగూడెం: కుటుంబ కలహాలు నేపద్యంలో ఒక వ్యక్తి వంటిపై డీజిల్ పోసుకుని బలవన్మరణ ప్రయత్నం చేసాడు. కొత్తగూడెం పట్టణం హనుమాన్ బస్తీకి చెందిన ఇమ్మానియెల్ (55) అనే వ్యక్తి ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. అవసరాల మేరకు కొంత అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులతో తరుచూ ఇంట్లో గొడవలు.భార్య భర్తల మధ్య గొడవ జరగడంతో తారాస్థాయికి చేరుకుంది.మాట మాట అనుకోని భార్య ఇంటి నుండి బయటికి వెళ్లిపోయింది. భార్యపై గొడవపడి మద్యం మత్తులో వంటి పై డీజిల్ పోసుకుని బలవన్మరణానికి ప్రయత్నం చేయగా 90 శాతం గాయాలతో ఉన్న ఇమ్మానియెల్ ను కుటుంబ సభ్యులు 108 సహాయంతో కొత్తగూడెం సర్వజన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తున్న వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. ఆసుపత్రికి చేరుకున్న పోలీసులు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.మెరుగైన చికిత్స కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## అతిథి మహిళా అధ్యాపకురాలి కోసం దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల జగిత్యాలలో మైక్రో బయాలజీ బోధించుటకు మహిళా అతిథి అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ఇంచార్జీ ప్రిన్సిపాల్ వేముల వనిత ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టు లో మాస్టర్ డిగ్రీ మరియు అనుభవం కలిగి ఉండాలని తెలిపారు.. అర్హులైన వారిని డెమో ద్వారా ఎంపిక చేయడం జరుగుతుందని, అర్హత, ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 29 రోజున ఉదయం 10 గంటలకు నేరుగా కళాశాలకు వచ్చి డెమోకు హాజరు కావలసిందిగా పత్రికా ప్రకటనలో తెలిపారు. వివరాలకు సెల్ నెంబర్: 8374000563 సెల్ నెంబర్ ను సంప్రదించాలన్నారు.

# గులాబీ నేతలకు హైడ్రా గుబులు

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం దక్కించుకున్న తర్వాత ప్రతిపక్ష పార్టీ నేతలకు రోజుకు ఓ రకంగా టెన్షన్ పట్టుకుంటోంది. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీకి ముందుగా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలు టెన్షన్ పట్టించాయి. ఇప్పటికే బీఆర్ఎస్‌కు చెందిన పదిమంది శాసనసభ్యులు, పలువురు శాసనమండలి సభ్యులు హస్తం పార్టీలో చేరిపోయారు. బీఆర్ఎస్ పార్టీ శాసనసభా పక్షం విలీనం అవుతుందంటూ రాజకీయంగా జోరుగా ప్రచారం జరిగింది. ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల వలసలకు తాత్కాలికంగా బ్రేక్ పడింది. కానీ.. రేవంత్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు గులాబీ నేతల్లో మరింత ఆందోళన రేపుతున్నాయి. తెలంగాణలో రాజకీయం ప్రస్తుతం ఈ వ్యవహారం చుట్టే తిరుగుతోంది. చెరువులు, కుంటలు వంటి నీటి వనరులను కాపాడేందుకు, అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేసేందుకు హైడ్రాను ఏర్పాటు చేసింది ప్రభుత్వం. ఒక సీనియర్ అధికారి రంగనాథ్‌ను ఇన్చార్జిగా నియమించింది. గత కొన్ని రోజులుగా దూకుడు పెంచిన హైడ్రా భూకబ్జాలపై కొరడా ఝుళిపిస్తోంది. ప్రముఖ సినీ నటుడు నాగార్జునకు చెందిన ఎన్-కన్వెన్షన్‌తో పాటు 18 ప్రాంతాల్లో 166 కట్టడాలను నేలమట్టం చేసింది. మరి కొంతమందికి నోటీసులు జారీ చేసింది.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కీలక నేతలుగా చలామణి అవుతున్న ఎంతోమంది నేతలు హైడ్రా టార్గెట్‌లో ఉన్నారన్న చర్చ గులాబీ నేతలను ఆందోళనకు గురిచేస్తుంది. జన్వాడ సమీపంలోని ఫామ్‌హౌస్ చుట్టూ వివాదం ముదురుతోంది. ఈ ఫామ్‌హౌస్‌ను హైడ్రా కూల్చేస్తుందన్న ప్రచారంతో ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ప్రదీప్ రెడ్డి- కోర్టును ఆశ్రయించారు. దీంతో అన్ని అనుమతులు పరిశీలించిన తర్వాతే తదుపరి చర్యలు చేపట్టాలని హైకోర్టు హైడ్రాకు సూచించింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యాసంస్థలు కూడా సాగునీటి వనరుల బఫర్ జోన్లో ఉన్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. దీంతో ఎమ్మెల్యే పల్లా అలర్ట్ అయ్యారు. అన్ని అనుమతులతోనే తాను విద్యాసంస్థలు నిర్మించానని న్యాయస్థానం తలుపు తట్టారు. దాదాపు 25 ఏళ్ల క్రితం నుంచి విద్యాసంస్థలు నడుపుతున్నానని.. గత 9 నెలలుగా ప్రభుత్వం నుంచి వేధింపులు మొదలయ్యాయన్నారు.ఈ వ్యవహారాన్ని గులాబీ పార్టీ కూడా సీరియస్‌గా పరిగణిస్తోంది. రెండు మూడు నెలల క్రితమే పార్టీ ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డిల విద్యాసంస్థలు అక్రమ నిర్మాణాలని వివాదం రేగడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తున్న గులాబీ పార్టీ ప్రభుత్వంపై ఘాటుగా స్పందించింది. కాంగ్రెస్ పార్టీలో చేరాలన్న ఒత్తిళ్లకు తమ ఎమ్మెల్యేలు భయపడకపోవడంతో పార్టీ నేతల ఆర్థిక మూలాలను దెబ్బతీసేందుకు ప్రభుత్వం కుట్రతో వ్యవహరిస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. అన్ని అనుమతులతోనే పల్లా రాజేశ్వర్ రెడ్డి విద్యాసంస్థల నిర్మాణం జరిగిందన్నారు.అక్రమ నిర్మాణాల పేరుతో గులాబీ నేతలను ప్రభుత్వం టార్గెట్ చేస్తే.. తాము కూడా అందుకు అనుగుణంగా రాజకీయంగా నిర్ణయాలు తీసుకోవాల్సి వస్తుందని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు.

# వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలి..

**రుచికరమైన భోజనాన్ని అందించాలి..**

**జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**

కరీంనగర్: చొప్పదండిలో బీసీ వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ హాస్టల్ల సందర్శన బీసీ సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాలను అత్యుత్తమంగా తీర్చిదిద్దాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం చొప్పదండి మున్సిపాలిటీలోని బీసీ, వెల్ఫేర్ సోషల్ వెల్ఫేర్ వసతి గృహాలను స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల్లో గదులను పరిశీలించారు. విద్యార్థులు ఎంతమంది ఉన్నారు. విద్యా బోధన.. హాస్టల్ పరిశుభ్రతకు తీసుకుంటున్న చర్యలు తదితర అంశాలను అధికారులను సిబ్బందిని జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వంటగదిని సందర్శించి విద్యార్థుల కోసం సిద్ధం చేసిన వంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం వసతి గృహాలను మరింత బలోపేతం చేస్తున్నదని తెలిపారు. వారికి అన్ని రకాలుగా ప్రభుత్వం అండగా ఉంటుందని విద్యతో పాటు సకల వసతులు కల్పిస్తున్నదని చెప్పారు. ప్రభుత్వ ఆశయాన్ని అధికారులు సిబ్బంది వమ్ము చేయకుండా మెలగాలని విద్యార్థులకు ఏ ఇబ్బంది రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. గదులు వాష్రూమ్స్ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, వ్యాధుల నివారణకు కృషి చేయాలని సూచించారు. వసతి గృహాల్లో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు.

**ఆరోగ్య కేంద్రం సందర్శన**

చొప్పదండి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు.. ప్రతిరోజు ఓపి తదితర అంశాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. మంగళవారం జరిగిన ఆరోగ్య మహిళ క్లినిక్ ను పరిశీలించి మహిళలకు పలు సూచనలు చేశారు. హాస్పిటల్ పరిశుభ్రతకు ప్రాధాన్య ఇవ్వాలని ప్రతి రోజు తప్పకుండా శుభ్రం చేయాలని సూచించారు. ప్రతి మంగళవారం జరిగే ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని, ప్రభుత్వ దాఖలు అన్ని పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. విద్యార్థులకు విద్యార్థులకు హెల్త్ చెకప్ చేయించడంపై జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి సరస్వతి, మున్సిపల్ కమిషనర్ నాగరాజు, వైద్యాధికారులు, సూపర్వైజర్ సిబ్బంది పాల్గొన్నారు.

# హైడ్రా లక్ష్యం నెరవేరేనా....?

హైదరాబాద్: చెరువులు కబ్జాలకు గురికావడంతో గ్రేటర్ హైదరాబాద్‌లో చిన్నపాటి వర్షం పడినా.. రోడ్లన్నీ చెరువులైపోతున్నాయి. కాలనీలకు కాలనీలే మునిగిపోతున్నాయి? పరిస్థితి ఇలాగే కొనసాగితే నగరానికి భవిష్యత్‌లో ప్రమాదం తప్పదని పర్యావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. వరదలను నివారించాలంటే ఆక్రమణలను తొలగించి చెరువులను కాపాడడం ఒక్కటే పరిష్కారమని సూచిస్తున్నారు. ఇప్పుడు హైడ్రా చేస్తున్న తొలగింపులతో లక్ష్యం నెరవేరుతుందా? అనేది చూడాల్సివుంది?.హైదరాబాద్ నగరంలో చెరువుల ఆక్రమణ నిత్యకృత్యంగా మారిందనే ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇతర నగరాలతో పోల్చిచూస్తే హైదరాబాద్‌లో ఈ సమస్య తీవ్రత ఎక్కువనే చెబుతున్నారు. నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుండటం? భూమి విలువ వందల రెట్లు పెరిగిపోవడంతో ఆక్రమణలు, అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ఇదే నగరానికి ప్రధాన సమస్యగా మారింది. ముఖ్యంగా హైదరాబాద్ పూర్తిగా మెట్ట ప్రాంతం, సముద్రానికి 600 మీటర్ల ఎత్తులో ఉన్న ప్రదేశం.డెక్కన్ పీఠ భూమిలో ఉన్న హైదరాబాద్‌కు వర్షపు నీరే ఆధారం. వర్షం నీటిని వడిసి పట్టుకుంటేనే ప్రజల దాహార్తి తీరేది. వర్షం పడితేనే నీరు, లేకుంటే గుండె చెరువు అన్నట్లు తయారైంది హైదరాబాద్ పరిస్థితి. ఇక్కడ పడే ప్రతి నీటి చుక్కను కాపాడి ప్రజల అవసరాలను తీర్చడానికి వందలాది చెరువులు తవ్వగా, అవేవీ ఇప్పుడు కనిపించకపోవడం ఆందోళనకరం.నీటి వనరులను ధ్వంసం చేస్తుండటం అత్యంత ప్రమాదమని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడంలేదు. వర్షపు నీరు పట్టుకుని వాడుకునే వ్యవస్థలో ఇప్పటికీ చెరువుది కీలక భూమిక. చెరువులు ఉంటేనే చల్లదనం, పచ్చదనం, ఆహారం, జీవ వైవిధ్యం. కానీ, రియల్ భూమ్‌తో కాసులకు కక్కుర్తి పడి చెరువులను చెరబడుతున్నారు.నగరంలో వందలాది చెరువుల్లో భవనాలు, వ్యాపార సముదాయాలు వెలిశాయి. నీటి వనరులను భూములుగా మార్చే వ్యాపార వస్తువుగా మార్చేయడంతో నగరంలో చెరువులు క్రమంగా కనుమరుగయ్యాయి. చెరువుల రక్షణకు చట్టాలు ఉన్నా, ఇన్నాళ్లు అవేవీ సక్రమంగా అమలు కాలేదు. ఫలితంగా నీటి కుంటలు కాలనీలుగా మారాయి.

# కరీంనగర్ లో చెరువులు, నాలాల ఆక్రమణ

కరీంనగర్: బరితెగించిన కోడి బజార్లో గుడ్డు పెట్టిందట. అచ్చం అలానే ఉంది భూ కబ్జాదారుల యవ్వారం. ఓవైపు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తుంటే.. మరోవైపు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో భూ కబ్జాలు యదేచ్ఛగా సాగుతున్నాయి. దీంతో హైడ్రా హైదరాబాద్‌కే పరిమితం కాకుండా.. జిల్లాలకు విస్తరించాలని జనం కోరుతున్నారు.జగిత్యాల మండలం మోతె చెరువు బఫర్ జోన్‌లో అక్రమంగా ఇళ్లు నిర్మాణాలు చేపట్టారు. ఎఫ్టీఎల్ పరిధిలో మట్టిని తీసి చెరువు స్థలాన్ని కబ్జా చేసే పనిలోపడ్డారు. జేసీబీతో చెరువు మట్టి తీసి.. కబ్జా చేసిన స్థలాన్ని చదును చేస్తుండగా మత్స్యకారులు అడ్డుకున్నారు. రెండు రోజుల నుంచి ఎఫ్టీఎల్ పరిధిలో స్థానిక కౌన్సిలర్.. జేసీబీతో మట్టి పోసి కబ్జా చేస్తున్నారని ఆందోళనకు దిగారు. మట్టి తీసే పనులను అడ్డుకుని చెరువు భూమిని కాపాడాలని పోలీసులకు పిర్యాదు చేశారు. మోతే చెరువు ఎఫ్టీఎల్ పరిధిలో సుమారు 20 ఎకరాల వరకు కబ్జా అయ్యిందనే ఆరోపణలు ఉన్నాయి.అక్కడ, ఇక్కడ అనే తేడా లేదు. ఎక్కడ చూసినా చెరువులు కుంటలు కబ్జాకు గురయ్యాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో వందలాది చెరువులు కుంటలు కనుమరుగయ్యాయి. పట్టించుకునేవారు లేక కబ్జా గురైన చెరువుల్లో అక్రమ నిర్మాణాలు వెలిశాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 13,456 హెక్టార్లలో 1008 చెరువులు, కుంటలు ఉన్నాయి. వాటికి హద్దులు నిర్ణయించకపోవడంతో కబ్జాదారుల కన్నుపడి కనుమరుగైపోతున్నాయి.కరీంనగర్ సమీపంలోని గ్రామాల్లో నూటికి 70 శాతం చెరువులు కుంటలు మాయమైపోయాయి. బొమ్మకల్, తీగలగుట్టపల్లి, ఆరపల్లి, సీతారాంపూర్, రేకుర్తి, చింతకుంట, అలుగునూరు గ్రామాలు భూమాఫియాకు అడ్డాగా మారాయి. ముఖ్యంగా బొమ్మకల్ గ్రామ పరిధిలో 46.21 ఎకరాల్లో ఉన్న జక్కప్ప చెరువు, 28.10 ఎకరాల్లో ఉన్న గోపాల్ చెరువు, 16.10 ఎకరాల్లో ఉన్న నల్లచెరువు, 12 ఎకరాల్లో ఉన్న గోధుమకుంట, 9.10 ఎకరాల్లో ఉన్న రావికుంట కబ్జాకు గురయ్యాయి.కరీంనగర్ సమీపంలోని అలుగునూరు మామిడికుంటలో అక్రమ నిర్మాణాలు వెలిచాయి. నగరాన్ని ఆనుకుని ఉన్న బొమకల్ శివారులోని గోపాల్ చెరువు కనుమరుగయింది. చెరువు స్థలంలో రెండు గోదాములు తోపాటు ఓ ఫంక్షన్ హాల్ నిర్మాణం జరిగింది.తీగలగుట్టపల్లి, ఆరెపల్లి సమీపంలోని మాలకుంట, ఉడత కుంట, అవుసుల కుంట విస్తీర్ణం సగానికి తగ్గిపోయింది. తీగలగుట్ట పల్లి మెయిన్ రోడ్డు పక్కనే ఉన్న ఊరకుంటలో ఎఫ్టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టారు. కబ్జాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులం దినా చర్యలు మాత్రం శూన్యం.బొమ్మకల్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన బిఆర్ఎస్‌కు చెందిన మాజీ ఎమ్మెల్యే విద్యాసంస్థ ఉంది. ఇక్కడ చెరువు శిఖం భూమిని కబ్జా చేయడమే కాకుండా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. గతంలో ఫిర్యాదులు రావడంతో.. అధికారులు సర్వే చేసి సర్కార్ భూమి ఎక్కడి వరకు ఉంటుందో నిర్ధారించారు. అయినా హద్దులు దాటి మళ్లీ నిర్మాణా లు చేపట్టారు. బీఆర్ఎస్ పాలనలో కబ్జాలు మితిమీరి పోయాయ నే ఆరోపణలు ఉన్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ ఆఫీసర్ల చేతివాటం.. బడా లీడర్ల భరోసాతోనే చెరువులు, కుంటలు కనుమరుగ య్యాయనే ఆరోపణలు ఉన్నాయి. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అమాయకుల ప్లాట్లను కబ్జా పెట్టిన లీడర్లను.. కరీంనగర్ సీపీ అభిషేక్ మహంతి జైలుకు పంపారు. కానీ.. ప్రభుత్వ స్థలాల ఆక్రమ ణలకు పాల్పడిన వ్యక్తులపై ఫోకస్ పెట్టలేదు. ఇప్పటికైనా హైదరాబాద్ చుట్టుపక్కల అక్రమ కట్టడాలను కూలుస్తున్న హైడ్రా తరహాలోనే.. కరీంనగర్ కోసం కాడ్రాను ఏర్పాటు చేయాలని ఉమ్మడి జిల్లా ప్రజలు కోరుతున్నారు.

# టీ కాంగ్రెస్ లో బీసీ నినాదం...

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలప్పుడు అందరి నోటా వినిపించిన మాట.. బీసీలకు ప్రాధాన్యత. అప్పట్లో టికెట్లను ముందే ప్రకటించిన బీఆర్ఎస్.. 22 మంది బీసీలకు సీట్లు ఇచ్చింది. బీఆర్ఎస్ కంటే ఒక సీటు ఎక్కువే బీసీలకు ఇస్తామంది కాంగ్రెస్. అన్నట్టుగానే బీఆర్ఎస్ కంటే ఒక సీటు ఎక్కువే ఇచ్చింది గానీ.. ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం ప్రతి పార్లమెంట్ సెగ్మెంట్‌లో 2 సీట్ల చొప్పున 34 అసెంబ్లీ సీట్లను బీసీలకు ఇవ్వలేకపోయింది. తెలంగాణలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 31 స్థానాలు రిజర్వ్‌డ్ కేటగిరీ. మిగిలిన 88 నియోజకవర్గాలు జనరల్. పైగా అత్యంత బలమైన ఓట్ బ్యాంక్.. బీసీలదే. ముదిరాజ్‌లు 26 లక్షలు, మున్నూరు కాపులు 15 లక్షలు, గౌడ్లు 10 లక్షలు, యాదవులు 13 లక్షలు, పద్మశాలీలు 12 లక్షలు.. ఇలా ప్రతి కమ్యూనిటీలో లక్షల సంఖ్యలో ఉన్నారు. ఆమాటకొస్తే.. తెలంగాణ జనాభాలో సగానికి పైగా ఉన్నది బీసీలే. కనీసంలో కనీసం 81 అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థుల గెలుపోటములను బీసీ ఓటర్లే నిర్ణయిస్తారు. అయినా సరే.. ఏ పార్టీ కూడా ఇరవై, పాతికకు మించి సీట్లు ఇవ్వడం లేదు. ప్రతిసారి ఎన్నికలప్పుడే బీసీ నినాదం పుట్టుకొస్తుంది. ఈసారి మాత్రం ఎన్నికలన్నీ అయ్యాక బీసీ నాదం వినిపిస్తోంది.బీసీ నినాదం కంటే.. రెడ్డి సామాజిక వర్గానికే ఎక్కువ ప్రాధాన్యత దక్కుతోందని విమర్శిస్తున్నాయి బీసీ సంఘాలు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా రెడ్లకే ఎక్కువ సీట్లు ఇచ్చాయి. తెలంగాణలో 56 శాతం జనాభా ఉన్న బీసీలకు.. బీఆర్ఎస్ 22 సీట్లు ఇస్తే, కాంగ్రెస్ 23 సీట్లు ఇచ్చింది. మొత్తం జనాభాలో 6.5 శాతమే ఉన్న రెడ్డి సామాజికవర్గానికి మాత్రం.. బీఆర్ఎస్ 42 సీట్లు, కాంగ్రెస్ 44 సీట్లు ఇచ్చాయి. అధికారంలోకి వచ్చిన తరువాత కూడా రెడ్డి సామాజికవర్గం వారికే కీలక మంత్రి పదవులు దక్కాయన్న విమర్శలు ఉన్నాయి. సో.. తెలంగాణలో సీట్ల కేటాయింపు నుంచి పదవుల పంపకం వరకు అన్నింటా బీసీలను పక్కనపెట్టి.. రెడ్డి కమ్యూనిటీకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారని బహిరంగంగానే రోడ్లపైకి వస్తున్నారు కాంగ్రెస్ నేతలు. బీసీలకు గనక 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వకపోతే భూకంపం సృష్టిస్తామని డైరెక్టుగానే మాట్లాడుతున్నారు.

# ఓటర్ జాబితా రూపకల్పకై దృష్టి

పల్లెల్లో పంచాయతీ ఎన్నికలకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. తాజాగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల చేయడంతో దసరా నాటికి ఎన్నికలు రావచ్చనే అంచనాలతో ఆశావాహులు సందడి చేస్తున్నారు. రిజర్వేషన్లలో మార్పులు ఎలా ఉన్నా పోటీకి సిద్ధమే అంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన నాయకులు, స్వచ్ఛంద సామాజిక సేవకులు పోటీవైపు దృష్టి పెట్టారు. ఎన్నికల సంఘం సెప్టెంబరు 6న గ్రామపంచాయతీల ఎన్నికలకు సంబంధించి ఓటరు ముసాయిదా జాబితాను జారీ చేయనుంది. దీనిపై 7వ తేదీ నుంచి 13 వరకు డీపీవోలు, ఎంపీడీవోలు, అభ్యంతరాలను స్వీకరిస్తారు. 19వ తేది లోగా అభ్యంతరాలను పరిష్కరించి 21న వార్డుల వారీగా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. దీంతో పాటు ఎన్నికల కమిషన్ అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశాలు కూడా నిర్వహిస్తోంది. ఈ నెల 29న రాష్ట్ర ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్లతో కాన్ఫరెన్స్ కూడా నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. ఎన్నికల జాబితాపై సెప్టెంబరు 9, 10 తేదీల్లో రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులతో జిల్లా, మండల స్థాయిలో సమావేశాలు నిర్వహించనున్నారు. రాష్ట్రఎన్నికల సంఘం 2019 సంవత్సరంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. ఈసారి కూడా మూడు విడతల్లోనే ఎన్నికలు నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఎన్నికల సంఘం 200 మంది ఓటర్లతో ఉండే విధంగా బూత్‌ను ఏర్పాటు చేయడం, బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, పోలింగ్ అధికారి, 201 నుంచి 400 మంది ఓటర్లు ఉన్న బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ అధికారులు, 401 నుంచి 600 మంది ఉండే పోలింగ్ బూత్‌లో ఒక ప్రీసైడింగ్ అధికారితోపాటు ముగ్గురు పోలింగ్ అధికారులను నియమించే విధంగా సిబ్బంది వివరాలను సేకరించి టీపోల్ సాఫ్ట్‌వేర్‌లో పొందుపర్చారు.

# మళ్లీ తెరపైకి జన్వాడ ఫాంహౌస్

హైదరాబాద్: హైడ్రా ఏర్పాటైన తర్వాత అక్రమ నిర్మాణాలపై రేవంత్ సర్కార్ ఉక్కుపాదం మోపుతోంది. నింబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారు ఎంతటి వారైనా కూల్చివేతలకు వెనుకాడటం లేదు. కేటీఆర్ లీజుకు తీసుకున్నానని చెప్తున్న జన్వాడ ఫాంహౌస్ మరోసారి వార్తల్లోకెక్కింది. ఇరిగేషన్ అధికారులు కేటీఆర్ ఫాంహౌస్‌కి వెళ్లారు. అక్కడ కొలుతలు కూడా తీసుకున్నారు. ఫాంహౌస్ వ్యవహారంపై ఇరిగేషన్ శాఖతోపాటు హైడ్రాకు పలు ఫిర్యాదులు అందాయి. దీంతో వారు రంగంలోకి దిగారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలపై హైడ్రా గత కొంతకాలంగా కొరడా ఝుళిపిస్తోంది. గండిపేట్ జలాశయం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ఫాంహౌస్‌లను కూల్చివేసేందుకు వివరాలు సేకరిస్తోంది. జన్వాడ ఫాంహౌస్ కూల్చివేసే విషయంలో నిబంధనలకు అనుగుణంగా నడుచుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. జీవో 99 ప్రకారమే నడుచుకోవాలని హైడ్రాను ఆదేశించింది. నిబంధనలు ఉల్లంఘించి ఎఫ్‌టీఎల్ పరిధిలో ఫాంహౌస్ ఉంటే తానే దగ్గర ఉండి కూల్చివేయిస్తానని కేటీఆర్ చెప్పారు. అయితే, అక్కడ నిబంధనల ఉల్లంఘన జరిగినట్టు అధికారులు గతంలోనే తేల్చారు. 2020లోనే ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. బుల్కాపూర్ నాలాను కబ్జా చేసినట్లు రిపోర్ట్ ఇచ్చారు. స్వేచ్ఛ ? బిగ్ టీవీ దగ్గర జన్వాడపై జరిపిన సర్వే రిపోర్ట్ ఉంది. బుల్కాపూర్ నాలా పక్కనే ఉన్న ఈ ఫాంహౌస్ ఉంది. మంత్రిగా ఉన్నప్పుడు కేటీఆర్ అక్కడే ఉండేవారు. ఫాంహౌస్ చుట్టూ కేటీఆర్ భార్య, సన్నిహితుల భూములు ఉన్నాయి. బుల్కాపూర్ నాలాను కబ్జా చేస్తూ ఫాంహౌస్ గేటు నిర్మాణం చేశారు. గేటు కారణంగా నాలా కుచించుకుపోయిందనేది రిపోర్ట్ సారాంశం. 2020లో రిపోర్ట్ తయారైనా గతంలో అధికారులు చర్యలు తీసుకోలేదు. నాలాకు 9 మీటర్ల వరకూ బఫర్ జోన్ ఉంది. నిబంధనల ప్రకారం బఫర్ జోన్‌లోనూ ఎలాంటి కట్టడాలు ఉండకూడదు. భారీ ప్రహారీ గోడను కట్టి గేటు ఏర్పాటు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా ఫాంహౌస్ నిర్మించారు. ఇరిగేషన్ అధికారులు కొలతలు తీసుకున్న నేపథ్యంలో జన్వాడ ఫాంహౌస్ కూల్చేస్తారనే ప్రచారం జరుగుతోంది. చాంద్రాయణ గుట్టలో సలకం చెరువులో 12 ఎకరాలు కబ్జా చేసి ఒవైసీ కాలేజీ నిర్మాణం చేసినట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న కాలేజీని కూల్చివేయాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. ఈ క్రమంలో విచారణ చేపట్టిన అధికారులు ఇప్పటికే కాలేజీకి నోటీసులు పంపారు. మంగళవారం సలకం చెరువును పరిశీలించినట్టు తెలుస్తోంది. దీంతో రేపోమాపో దీన్ని కూడా కూల్చివేస్తారని వార్తలు వస్తున్నాయి. సోషల్ మీడియాలో ఒవైసీ కాలేజీ ఫోటోలు, వీడియోలు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా బీజేపీ నేతలు ఈ అంశాన్ని చాలా సీరియస్‌గా తీసుకున్నారు. దీనిపై గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ స్పందించారు. ఒవైసీ పెద్ద బంగ్లా నిర్మించారని, ఆయన ఇల్లు ప్రభుత్వ భూమిలో ఉండొచ్చని అన్నారు. దానిపై ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ మద్దతుతోనే చెరువు కబ్జా చేసి కాలేజీ కట్టారని, 30 ఎకరాల చెరువుల్లో 12 ఎకరాలు ఆక్రమించారని ఆరోపించారు. ఒవైసీ బ్రదర్స్ ఎడ్యుకేషన్ పేరుతో కోట్లు కొల్లగొడుతోందన్న రాజాసింగ్, చెరువుల పరిరక్షణకు సీఎం చేస్తున్న పనిని అభినందిస్తున్నానని అన్నారు. సీఎంను అక్బరుద్దీన్ భయపెట్టాలని చూస్తున్నారని, ఆయన భయపడకుండా ముందుకు వెళ్లాలని సూచించారు. మాజీ సిఎం కిరణ్ కుమార్ రెడ్డిని ఇలాగే బెదిరిస్తే ఆయన అరెస్ట్ చేయించారని గుర్తు చేశారు. తన నియోజకవర్గంలో ఎంఐఎం నేతలు హైదరాబాద్ కలెక్టర్ మద్దతుతో ప్రభుత్వ భూములను ఆక్రమించారని ఆరోపించారు. వాటిపైనా ఎంక్వైరీ చేసి గవర్నమెంట్ ల్యాండ్‌ను కాపాడాలని కోరారు

ఎవరైనా ఒక్కటే....

హైడ్రా కమిషనర్ రంగనాథ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒవైసి అయినా మల్లారెడ్డి అయినా హైడ్రాకు ఒక్కటే అన్నారు. చెరువుల్లో కాలేజీలు కడితే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఒవైసి బ్రదర్స్ సలకం చెరువులో నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఫిర్యాదు చేసిన బీజేపీ కార్పొరేటర్లతో ఆయనీ వ్యాఖ్యలు చేశారు. చెరువుల్లో కాలేజీలు కట్టి ఉంటే చర్యలు తీసుకుంటామని తేల్చి చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకుని కొంత సమయం ఇస్తున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. రాజకీయ చదరంగంలో హైడ్రా పావు కాదన్నారు. రంగనాథ్ ను కలిసిన బీజేపీ కార్పొరేటర్లు ఓల్డ్ సిటీ చెరువులపైన ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని కోరారు. చెరువును ఆక్రమించి ఒవైసి సోదరులు కట్టిన భవనాలను కూల్చేయాలన్నారు.

# ఆగమాగం అవుతున్న బత్తాయి రైతు



నల్గొండ: బత్తాయి సాగులో దేశ వ్యాప్తంగా ఉమ్మడి నల్గొండ జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. నాలుగు దశాబ్దాల కింద జిల్లాలో బత్తాయి సాగు మొదలైన రోజుల్లో దాదాపు 3 లక్షల ఎకరాల్లో తోటలు ఉంటే.. ఇపుడా విస్తీర్ణం 40వేల ఎకరాలకు తగ్గిపోయింది. నాసిరకం మొక్కలు, సరైన దిగుబడి రాకపోవడం, దిగుబడికి కనీస గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వ మద్దతు అంతంతమాత్రంగానే ఉండడం, స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడం, దళారులు చెప్పిందే వేదం కావడం, మార్కెట్ లో రైతులు నిలువు దోపిడీకి గురికావడం వంటి కారణాలతో జిల్లాలో బత్తా తోటల సాగు విస్తీర్ణం దారుణంగా పడిపోయింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఒక నాడు బత్తాయి తోటల సాగు ఉద్యమంలా కొనసాగింది. తోటల సాగు రోజు రోజుకు భారీగా పెరిగిపోతున్న పెట్టుబడులు.. వస్తున్న కాయల దిగుబడి, మార్కెట్ లో బత్తాయికి ఉన్న ధరకు పొంతనలేకుండా పోతోంది. ప్రతీ ఏటా బత్తాయి రైతుకు ధర గిట్టుబాటు కాకున్నా.. ఈ సారన్నా ధర బాగా వస్తుందేమోనన్న ఆశాభావంతో రైతులు ఎదురు చూడడం పరిపాటిగా మారింది. ఈ సీజన్లో టన్ను బత్తాయికి తోటల వద్ద రూ.11 వేల నుంచి రూ.18 వేలు మాత్రమే దళారులు చెల్లిస్తున్నారని బత్తాయి రైతులు వాపోతున్నారు. బత్తాయి దిగుబడుల్లో ముందుగా ఏప్రిల్ ? జూన్ వరకు కత్తెర ( ఈ సీజన్ లో కేవలం 5శాత దిగుబడి మాత్రమే వస్తుంది ), జూలై ? నవంబరు నెలల మధ్య మెయిన్ సీజన్ ( 95 శాతం ఈ సీజన్ లోనే వస్తుంది ) లుగా పేర్కొంటున్న రైతులు ఈ ఏడాది కత్తెర పంటకు కూడా గిట్టుబాటు ధర రాలేదంటున్నారు. ఈ ఏడాది మే నెలలో మాత్రం మంచి సరుకుకు టన్నుకు రూ.40వేల ధర పలికిందని, అదీ నాలుగైదు రోజులు మాత్రమేనని పేర్కొంటున్నారు. బత్తాయి రైతుల మార్కెట్ కష్టాలు తీర్చేందుకు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన మార్కెట్ మూణ్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోగా, హైదరాబాద్ బాటసింగారం మార్కెట్ లో దళారులు, వ్యాపారులు ఆడిందే ఆటగా రైతులను దోచుకుంటున్నారని, ఈ సీజన్లో గడిచిన నెల రోజులుగా బాటసింగారం పండ్ల మార్కెట్లో టన్ను ధర రూ.18 వేలకు మించడం లేదని , ధరలు కనీసం గిట్టుబాటు కావడం లేదని రైతులు పేర్కొంటున్నారు. బత్తాయి తోటల సాగు విస్తీర్ణం గణనీయంగా పడిపోవడానికి, నాణ్యమైన సరుకు దిగుబడి వచ్చినా కనీసం గిట్టుబాటు ధర రాకపోవడానికి అనేక కారణాలున్నాయని చెబుతున్నారు. మరీ ముఖ్యంగా కరోనా తర్వాత బత్తాయి ధర పడిపోయినట్లు గుర్తించారు. ఢిల్లీ మార్కెట్ మీద ఆధారపడిన బత్తాయి రేటును స్థానిక దళారులు సైతం బాగా తగ్గించేస్తున్నారు. ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా బత్తాయి వ్యాపారం చేస్తోంది కర్నూలు జిల్లా నుంచి వస్తున్న దళారులే కావడం గమనార్హం. ఒక వేళ రైతులు సాహసించి తోటల దగ్గర తమ సరుకును అమ్ముకోకుండా మంచి రేటు వస్తుందన్న ఆశతో నేరుగా మార్కెట్ కు తీసుకు పోతే రకరకాల పేర్లతో రైతును లూటీ చేస్తున్నారని వాపోతున్నారు. ఇందులో ప్రధానమైనది చూట్ తీయడం.

మార్కెట్ లో వ్యాపారులు సిండికేట్ గా మారి ధరలను నియంత్రిస్తున్నారు. ఈ సారి వర్షాలు ఎక్కువగా కురియడం, మహారాష్ట్ర దిగుబడులో ముందే మార్కెట్ కు చేరుకోవడం ఒక కారణంగా చెబుతున్నారు. జిల్లాకుచెందిన బత్తాయి ఎక్కువగా బాట సింగారం మార్కెట్ లోనే విక్రయిస్తుండగా, తోటల దగ్గర బత్తాయిని కొనుగోలు చేసిన వ్యాపారులు ఢిల్లీ ఆజాద్ పుర మార్కెట్ కు తరలిస్తారు. అయితే, ఈ సారి ఢిల్లీలో కురిసిన వర్షాలు, వరదల కారణంగా మార్కెట్ లో సరుకుకు డిమాండ్ లేకుండా పోవడం కూడా ధరలు తగ్గడానికి కారణాలు చెబుతున్నారు.

# ఎయిర్ పోర్టు తరహాలో రైల్వేస్టేషన్

## 2026 నాటికి పూర్తి

హైదరాబాద్: సికింద్రాబాద్ రైల్వేస్టేషన్... దక్షిణ మధ్య రైల్వేలో ప్రధాన స్టేషన్. నిత్యం లక్షలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. ప్లాట్‌ఫామ్‌లు కూడా కిక్కిరిసి ఉంటాయి. ఎవరు వస్తున్నారో.. ఎవరు వెళ్తున్నారో.. ఎవరు ప్రయాణికులో... ఎవరు కాదో కూడా తెలియని పరిస్థితి. ఈ విధానం త్వరలోనే మారబోతోంది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ రూ.700 కోట్ల రూపాయల వ్యయంతో అత్యాధునిక హంగులతో సరికొత్తగా రూపుదిద్దుకుంటోంది. రీడెవలప్‌మెంట్‌లో భాగంగా... ఎన్నో మార్పులు జరగబోతున్నాయి. ముఖ్యంగా... భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ఎయిర్‌పోర్టుల్లో.. బ్యాగేజీ స్క్రీనింగ్ అనేది తప్పనిసరి. ప్రయాణికులు తెచ్చిన లగేజ్‌ని చెక్ చేసిన తర్వాతే... వారికి ఎంట్రీ ఉంటుంది. కానీ.. రైల్వేస్టేషన్లలో అలా ఉండదు. ముఖ్యంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ . ఎప్పుడూ రద్దీగానే ఉంటుంది. ప్లాట్‌పామ్‌లపై.. ఎప్పుడూ ప్రయాణికులు వేచి ఉంటారు. మరి వారి భద్రత విషయం ఏంటి..? చేతిలో బ్యాగ్‌తో వచ్చినవారంతా ప్రయాణికులు కానవసరం లేదు...? ఇటీవల... గంజాయి, డ్రగ్స్ అక్రమ రవాణా రైళ్ల మార్గంలో కూడా జరుగుతోంది. అందుకే... ఏ బ్యాగ్‌లో ఏముందో తెలుసుకోవడం ముఖ్యం. సుమారు రూ. 700 కోట్ల వ్యయంతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌ను అత్యంత ఆధునికరీంచనున్నారు. మరో ఏడాదిన్నరలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులు పూర్తి కానున్నాయి. ప్రపంచస్థాయి రైల్వేస్టేషన్ అందుబాటులోకి రానుంది. అయితే ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎయిర్ పోర్ట్ తరహా వ్యవస్థను అమలు చేసేందుకు రైల్వే శాఖ సిద్ధమవుతోంది. ఇకపై ఎవరు పడితే వారు రైల్వే ప్లాట్ ఫామ్స్‌పై లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోనున్నారు. రైలు వస్తుందన్న ప్రకటన వచ్చే వరకు ప్రయాణికులు వెయిటింగ్ హాల్‌లోనే ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. సికింద్రాబాద్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా... భద్రతకు పెద్దపీట వేస్తున్నారు. ప్రయాణికుల లగేజ్‌ను చెక్ చేసిన తర్వాతే.. స్టేషన్‌లోకి అనుమతించబోతున్నారు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు రెండు ప్రవేశ మార్గాలు ఉన్నాయి. ఒకటో నెంబర్, 10వ నెంబర్ ప్లాట్‌ఫామ్ నుంచి స్టేషన్‌లోకి ఎంట్రీ ఉంటుంది. ఒక్కో మార్గంలో 3 కోట్ల రూపాయల చొప్పున... రెండు మార్గాల్లో ఆరు కోట్ల రూపాయలతో బ్యాగేజీ స్క్రీనింగ్ వ్యవస్థ ను ఏర్పాటు చేయబోతున్నారు. ప్రయాణికులు రెండు మార్గాల్లో.. ఏ వైపు నుంచి వచ్చినా... లగేజ్ చెక్ చేసుకోనిదే లోపలికి వెళ్లనివ్వరు. ట్రైన్ టైమ్ అయిపోతున్నా సరే... లగేజీ చెకింగ్ తర్వాతే.. స్టేషన్‌లోకి ఎంట్రీ ఉంటుంది. కనుక.. ఎయిర్‌పోర్టులో ఫ్లయిట్ టైమ్ కంటే.. గంట, రెండు గంటల ముందు వెళ్లినట్టు... సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో కూడా ఈ విధానాన్ని పాటించాల్సిందే. ఎక్కాల్సిన రైలు సమయం కంటే... ముందుగా వస్తేనే... చెకింగ్ ప్రొసీజర్ పూర్తి చేసుకుని.. ప్లాట్‌ఫామ్‌కి చేరుకోగలరు. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ప్రస్తుతం... టికెట్ ఉన్నవారు నేరుగా ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లిపోతారు. టికెట్ లేని వారు... కౌంటర్ల దగ్గర టికెట్ కొనుక్కుని.. ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లిపోతారు. కానీ... ఆధునికీకరణ పనులు పూర్తయిన తర్వాత... అలా కుదరదు. అంతా కొత్త రూల్స్... కొత్త విధానాలే. ఎంట్రీ పాయింట్ దగ్గర బ్యాగేజీ చెకింగ్ అయిపోయాక... వెయిటింగ్ హాల్లో ( ఉండాలి. రైలు వచ్చేందుకు పదిహేను నిమిషాల ముందు.. స్టేషన్‌లో అనౌన్స్‌మెంట్ ఇస్తారు. అచ్చం ఎయిర్‌పోర్టుల్లో మాదిరిగానే. రైలు వస్తోందని అనౌన్స్‌మెంట్ వచ్చిన తర్వాతనే ప్లాట్‌ఫామ్‌పైకి వెళ్లాలి. అది కూడా టికెట్ ఉన్న వారు మాత్రమే. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో ఇప్పటి వరకు... ప్లాట్‌ఫామ్‌పైకి ఎవరు వెళ్తున్నారు.. వారి ప్రయాణికులు ఎంత మంది. వారి కోసం వచ్చిన బంధువులు ఎంత మంది... అనేది తెలియదు. కానీ ఆధునీకీకరణ తర్వాత.. కొత్త రూల్స్ అమలు చేయబోతున్నారు. ప్లాట్‌ఫామ్‌పైకి ప్రయాణికులను మాత్రమే అనుమతిస్తారు. బ్యాగేజీ స్క్రీనింగ్ అయిపోయి... వెయిటింగ్ హాల్లో.. ఎదురుచూసి.. రైలు అనౌన్స్‌మెంట్ వచ్చిన తర్వాత... ట్రైన్ టికెట్ ఉన్నవారిని మాత్రమే ప్లాట్‌ఫామ్‌కి వెళ్లనిస్తారు. వారితో వచ్చే బంధువులకు ఎంట్రీ ఉండదు.

అంటే.. ఊరు వెళ్లే తమ వారికి వెయిటింగ్ హాల్ నుంచే సెండాఫ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇది కూడా ఎయిర్‌పోర్టు తరహాలోనే ఉంది కదూ. మొత్తం రూ.700 కోట్లతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌ను ఆధునికీకరిస్తున్నాయి. ప్రస్తుతం 30శాతం పూర్తయినట్టు తెలుస్తోంది. 2026 నాటికి సరికొత్త రూపుతో... ప్రజలకు అందుబాటులోకి రానుంది సికింద్రాబాద్ రైల్వేస్టేషన్. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా... రీడెవలప్‌మెంట్ పనులను శరవేగంగా కొనసాగిస్తున్నారు అధికారులు.

# రాజముద్ర మార్పుపై గరం.. గరం...

## వరంగల్ ఫ్లెక్సీలపై కొత్త లోగో..

వరంగల్: తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నాం (రాజముద్ర)లో ప్రభుత్వం మార్పులు చేసింది! తెలంగాణ ఏర్పడిన కొత్తలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం కాకతీయ కళాతోరణం.. ఛార్మినార్‌లతో కూడిన రాజముద్రను రూపొందించగా.. అందులో రాచరిక ఆనవాళ్లు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఆ చిహ్నాంలో మార్పులు చేయాలని నిర్ణయించారు. మే నెలలో చిత్ర కారుడు రుద్ర రాజేశంతో చర్చించి మార్పులు, చేర్పులపై కసరత్తు చేశారు. జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా లోగోను రిలీజ్ చేస్తారని అంతా భావించారు. కానీ.. వివిధ కారణాల నేపథ్యంలో రాజముద్ర ఆవిష్కరణను వాయిదా వేశారు. ఇదిలా ఉంటే.. గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ హెడ్ ఆఫీస్ వద్ద ఏర్పాటు చేసిన.. ఎల్ఆర్ఎస్ హెల్ప్ డెస్క్ ఫ్లెక్సీపై గత రాజ ముద్ర స్థానంలో కొత్త లోగో దర్శనం ఇచ్చింది. దానికి సంబంధించిన ఫొటో ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుండగా.. అధికారికంగా లోగోను రిలీజ్ చేసినట్టేనని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఛార్మినార్, కాకతీయ కళాతోరణాలతో రాష్ట్ర అధికార చిహ్నాన్ని రూపొందించింది. అందులో రాచరిక ఆనవాళు ఉన్నాయని, అందులో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ సలహాదారులతో సమావేశమై అధికార చిహ్నాంపై పలుమార్లు చర్చలు జరిపారు. 1969లో తొలి దశ ఉద్యమం జరగగా, ఆనాటి ఆనవాళ్లు, ఉద్యమ స్ఫూర్తిని ప్రతిబింబించేలా అధికార చిహ్నాం ఉండాలని తీర్మానించారు. ఈ మేరకు రాజముద్రలో మార్పులు, చేర్పులపై చిత్ర కారుడు రుద్ర రాజేశంతో చర్చించి, రాష్ట్ర అధికారిక చిహ్నానికి తుది రూపు తీసుకొచ్చారు. కాగా జూన్ 2వ తేదీన రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా అధికారిక చిహ్నాన్ని విడుదల చేసేందుకు ఏర్పాట్లు చేయగా.. లోగో మార్పుపై బీఆర్ఎస్ నేతల అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికార చిహ్నాం నుంచి ఛార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగించడంపై ఆందోళనలు కూడా నిర్వహించారు. ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లేనిపక్షంలో మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. వరంగల్‌లో కొత్త లోగో కనిపించడంతో.. ప్రభుత్వం అధికార చిహ్నాన్ని మార్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బీఆర్ఎస్ నేతల నుంచి నిరసనలు వ్యక్తమైన నేపథ్యంలో.. సైలెంట్‌గా ప్రభుత్వం మార్పులు చేసి, రిలీజ్ చేసిందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ ముద్రలో జాతీయ చిహ్నాం నాలుగు సింహాల స్తూపం రాజముద్ర పైభాగంలో ఉండగా.. కింది భాగంలో అమర వీరుల స్తూపం ఉంది. అమర వీరుల స్తూపానికి ఇరువైపులా వరి గొలుసు ఉండగా.. లోగో చుట్టూ సర్కిల్ లో తెలంగాణ ప్రభుత్వం అని తెలుగు, హిందీ, ఇంగ్లీష్, ఉర్దూలో రాసి ఉంది. ఇప్పటికే ఈ ఫ్లెక్సీ సోషల్ మీడియాలో వైరల్ కాగా.. ప్రజల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది.

# గణేశ్ మండపాలకు కండిషన్స్ అప్లై

హైదరాబాద్: గణేష్ పండుగ సమీపిస్తున్న తరుణంలో.. శాంతి భద్రతలను కాపాడేందుకు హైదరాబాద్ పోలీసులు చర్యలు చేపట్టారు. సెప్టెంబర్ 7న వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 17న మహా నిమజ్జన ఉరేగింపు కార్యక్రమాలు ఉంటాయి. దీంతో పోలీసులు కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టారు. మండపాల ఏర్పాటు, ఉత్సవాల నిర్వహణకు మార్గదర్శకాలు రూపొందించారు. నిర్వాహకులు వాటిని ఫాలో అవ్వాలని స్పష్టం చేశారు. ఏమైనా సందేహాలుంటే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో.. లేదా 8712665785 నెంబర్‌ను సంప్రదించాలని పోలీసులు సూచించారు.

### నిబంధనలివే..

1. వివాదాస్పద ప్రదేశాల్లో వినాయకుడి మండపాలు ఏర్పాటు చేసేందుకు అనుమతి లేదు.
2. గణేష్ మండపాలు ఏర్పాటు చేసేందుకు ఎంచుకున్న ప్రభుత్వ, ప్రైవేటు స్థలాల యజమానుల నుంచి ఎన్‌వోసీ తీసుకోవాలి.
3. మండపాలకు అవసరమైన విద్యుత్తు ఏర్పాటుకు.. ఆ శాఖ నుంచి అనుమతి పొందాలి.
4. సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం రాత్రి 10 నుంచి మరుసటిరోజు ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లపై నిషేధం ఉంటుంది.
5. సెల్లార్లు, కాంప్లెక్స్‌ల్లో విగ్రహాల ఊరేగింపులకు పోలీసుల అనుమతి కచ్చితంగా ఉండాలి.
6. మండపాల వద్ద వాలంటీర్లు కార్డులు/బ్యాడ్జీలు ధరించాల్సి ఉంటుంది.
7. విగ్రహాలు ఊరేగింపుగా వెళ్లే మార్గం, సమయం వివరాలను ముందుగానే పోలీసులకు ఇవ్వాలి.
8. మండపాల వద్ద ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అగ్నిమాపక పరికరాలు ఉంచుకోవాలి.
9. మండపాల ఏర్పాటుకు సబంధించిన పత్రాలను జత చేసి ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 6వ తేదీ లోపు పోలీసుల వెబ్‌సైట్‌లో అప్లికేషన్ పెట్టుకోవాలి.

కచ్చితంగా పాటించాల్సిందే..

నిర్వాహకులు కచ్చితంగా ఈ నిబంధనలు పాటించాలని హైదరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలని కోరారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే.. చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాధారణ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఏ సమస్య ఉన్నా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు

# రేవంత్ కుసపోర్ట్ గా నెట్ జన్ను

హైదరాబాద్: చెరువుల పరిరక్షణ, అక్రమ కబ్జాలపై హైడ్రా పేరుతో సీఎం రేవంత్ జూలిపిస్తున్న కొరడాకు రోజురోజుకూ మద్దతు పెరుగుతోంది. అటు పొలిటికల్‌గా.. ఇటు సామాన్యుల నుంచి మద్దతు పెద్ద ఎత్తున వస్తోంది. బడాబాబుల ఒత్తిళ్లకు తగ్గేదేలేదంటున్న రేవంత్‌కు.. ఎన్-కన్వెన్షన్ కూల్చివేత హైడ్రాకు కావాల్సినంత మద్దతును కూడగట్టింది. చెరువుల పరిరక్షణకు హైడ్రా వ్యవస్థను ఏర్పాటు చేసిన సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అభినందించారు. హైడ్రా లాంటి వ్యవస్థను రాష్ట్రమంతటా విస్తారించాలని సీఎం రేవంత్‌కు ఆయన లేఖ రాశారు. చెరువుల పరిరక్షణ, చెరువుల్లో కబ్జాలు, ఆక్రమణలు తొలగించేందుకు సీఎం రేవంత్ ఏర్పాటు చేసిన హైడ్రాపై అన్ని వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. హైడ్రాపై ఎమ్మెల్యేలంతా రేవంత్ నిర్ణయానికి మద్దతు పలుకుతున్నారు. జిల్లాలు, నియోజకవర్గాల్లోనూ హైడ్రా తరహా యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సీఎంకు రాసిన లేఖలో కోరారు. భూముల ధరలు పెరగడంతో ప్రభుత్వ భూములు, చెరువులు, కుంటలను రియల్ఎస్టేట్ వ్యాపారం కోసం ఆక్రమించి, వెంచర్లు, లేఅవుట్లు వేసి చెరువులను ధ్వంసం చేస్తున్నారని ఆయన అన్నారు. ఈ ఆక్రమణలతో చెరువులు, కుంటలు రూపం కోల్పోయి, నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి, ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడుతున్నారని ఆయన చెప్పారు. నకిరేకల్ నియోజకవర్గంలో 70 కిలోమీటర్ల మేర జాతీయ



రహదారి విస్తరించి ఉందని, ఇరువైపులా ఉన్న చెరువులు, కుంటలు ఆక్రమణలకు గురయ్యాయని అన్నారు. వాటిని పరిరక్షించేందుకు, ఆక్రమణలు తొలగించేందుకు హైడ్రా తరహా వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే వీరేశం కోరారు. తన నియోజకవర్గంలో నిజాం కాలం నుంచి ఉన్న గొలుసుకట్టు చెరువులను ఆక్రమణదారులు ధ్వంసం చేసి రూపం లేకుండా చేశారని చెప్పారు. పూర్వం రోజుల్లో యేరు వచ్చి ఊరుమీదపడి ఊరు మునిగిందని వినేవారమని, అయితే ఇప్పుడు ఆక్రమణలో ఊరే చెరువుల్లోకి వెళ్లిన పరిస్థితి దాపురించిందని తెలిపారు. దీన్ని సరిచేసేందుకు సీఎం తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ప్రజలంతా హర్షిస్తున్నారని అన్నారు. రాష్ట్రంలోని అన్ని చెరువులకు పునర్జీవం పోయాలని ఆయన సీఎం రేవంత్ రెడ్డిని కోరారు.

# అందుబాటులోకి రుణమాఫీ యాప్

వరంగల్: రుణమాఫీలో ఉన్న సమస్యలకు చెక్ పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అర్హులై ఉండి వివిధ కారణాలతో రుణమాఫీ కాని వారిని గుర్తించేందుకు రైతు భరోసా పంట రుణమాఫీ యాప్‌ను తీసుకొచ్చింది ప్రభుత్వం. వ్యవసాయ శాఖ రూపొందించిన యాప్ క్షేత్రస్థాయి సిబ్బందికి పంపించారు. యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో కూడా ట్రైనింగ్ ఇచ్చారు. అర్హులై ఉండి రుణమాఫీ కాని వారి ఇళ్లకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అనంతరం వారి నుంచి ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి సంతకం పెట్టి ఇస్తారు. ఇందులో భాగంగానే మంగళవారం నుంచి పూర్తిస్థాయిలో వ్యవసాయశాఖ సర్వే చేయనుంది. ముందుగా ప్రయోగాత్మకంగా రైతుల వివరాలు నమోదు చేయనున్నారు. సమస్యలుంటే పరిష్కరించుకున్న తర్వాత పూర్తిస్థాయి సర్వే చేపట్టాలని ఆదేశించింది. ఇప్పటికే చాలా మంది రైతులు తమకు రుణమాఫీ కాలేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. వాళ్ల ఫిర్యాదులు పరిశీలించిన అధికారులు.. రేషన్ కార్డు లేకపోవడం, కుటుంబ వివరాలు సరిగా నమోదు కాకపోవడంతో మాఫీ కాలేదని తేల్చారు. అందుకే నేరుగా ఇంటికే వెళ్లి వివరాలు నమోదు చేసి మాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా ఫిర్యాదులు వచ్చిన రైతుల ఇంటికి అధికారులు వెళ్తారు. రుణఖాతాలు, రేషన్ కార్డు, ఆధార్, ఇతర పత్రాలు పరిశీలిస్తారు. కుటుంబసభ్యుల వివరాతీసుకుంటారు. వారి ఫొటోలు తీసుకుంటారు. వాటి ఆధారంగా రుణమాఫీకి సంబం ధించిన వివరాలు, ఫోన్‌నెంబర్‌తో ధ్రువీకరణ పత్రాన్ని రూపొం దించి కుటుంబయజమాని తో సంతం తీసుకుంటారు. దీన్ని పంచా యతీ కార్యదర్శి ధ్రువీకరించాల్సి ఉంటుంది. దీని ప్రకారం అర్హులైన వారిని గుర్తించి రైతులకు రుణమాఫీ చేయాలని భావిస్తోంది ప్రభుత్వం.

# ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ఖమ్మం: ప్రభుత్వ భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నేడు కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గ రెవెన్యూ, హౌజింగ్ అధికారులతో రెవెన్యూ, హౌజింగ్ పై మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ స్థలాల పరిరక్షణ బాధ్యత మనపై ఉందన్నారు. ప్రభుత్వ స్థలాలను గుర్తించి, ఫెన్సింగ్ ఏర్పాటుచేసి, రక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పేదలకు ఇండ్ల స్థలాల పంపిణీ, ప్రభుత్వ భవిష్యత్ అవసరాలకు, పరిశ్రమలు, అభివృద్ధి కి స్థలాలు ఎంతో అవసరమన్నారు. రఘునాథపాలెం మండలంలో అక్రమ మైనింగ్ కార్యకలాపాల నియంత్రణ కు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని అన్నారు. మైనింగ్, పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకొని అక్రమ మైనింగ్ కి అడ్డుకట్ట వేయాలన్నారు. ఖమ్మం అర్బన్ మండలం గోళ్లపాడు చానల్ పై ఆక్రమణల తొలగింపుపై చర్యలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ జీవో 58, 59 లపై న్యాయబద్ధంగా లేని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. తిరస్కరించిన దరఖాస్తులకు సంబంధించి స్థలాలను స్వాధీనం చేసుకుని, ఫెన్సింగ్ ఏర్పాటు, రక్షణ చర్యలు చేయాలన్నారు. రోడ్డు ఆక్రమణలు, అభివృద్ధి పనులకు అడ్డుగా ఉన్నచోట ప్రత్యామ్నాయ స్థలం చూపాలన్నారు. రోడ్ల విస్తరణ పై దృష్టి పెట్టాలన్నారు. ఎన్ఎస్పీ భూములకు సంబంధించి చట్టబద్ధంగా స్థలాల పంపిణీ, ఆక్రమణలపై సమగ్ర నివేదిక సమర్పించాలన్నారు. చెరువులు, కాల్వల స్థలాల పరిరక్షణ చేయాలన్నారు. డంపింగ్ యార్డ్ వద్ద ఏరోజుకారోజు తడి, పొడిచెత్త వేరుచేయడం, డిస్పోజ్ చేయడం జరగాలన్నారు. రహదారుల కిరువైపుల మొక్కలు నాటేటప్పుడు, విస్తరణ, కరంట్ లైన్లను దృష్టిలో పెట్టుకొని, భవిష్యత్ అవసరాల మేరకు చర్యలు తీసుకోవాలని మంత్రి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌళిక సదుపాయాల కల్పన కు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. నిర్మాణం చేపట్టిన అన్ని డబుల్ బెడ్ రూం ఇండ్లకు సంబంధించి, అధికారులు అన్ని కాలనీలు సందర్శించి, నిర్మాణ పనుల పరిస్థితి ని తనిఖీ చేయాలన్నారు. ప్రారంభించిన ఇండ్లు పునాది, లెంటల్, స్లాబు వరకు, తుది దశలో ఉన్న ఇండ్ల పరిస్థితి వారిగా సమగ్ర నివేదిక సమర్పించాలని, ఇండ్ల నిర్మాణం పూర్తిచేసి, లబ్దిదారులకు అందజేయడానికి అవసరమైన నిధుల వివరాలు సమర్పించాలని మంత్రి అన్నారు.

సమీక్షలో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, గుర్తించిన స్థలాల పరిరక్షణకు ఫెన్సింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వ స్థలాల పరిరక్షణ కు అన్ని చర్యలు చేపట్టనున్నట్లు ఆయన అన్నారు. వివిధ దశల్లో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పరిస్థితిపై అధికారులు నివేదిక సమర్పించాలన్నారు.

# అర్బన్ మండలంలో కలెక్టర్ పర్యటన

సిద్దిపేట: సిద్దిపేట అర్బన్ మండలంలో జిల్లా కలెక్టర్ ఎం. మను చౌదరి పర్యటించారు. మిట్టపల్లి గ్రామంలోని అంగన్వాడీ పూర్వ ప్రాథమిక పాఠశాల–2 ను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. జిల్లా సంక్షేమ అధికారి శారద అంగన్వాడి సెంటర్లో కొత్తగా వేయించిన పెయింటింగ్ లలో కాలనిర్ణయ పట్టిక, ఫుడ్ మెను, పిల్లల సమగ్రాభివృద్ధి ఉపయోగపడే పలు చిత్రాలతో కూడిన పెయింటింగ్ లను కలెక్టర్ కి చూపించగా చాల అందంగా బాగున్నాయని అభినందించారు. ఈ సెంటర్లో 15 మంది పిల్లలను బాగ చూసుకోవాలని దానికి కావలసిన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని అంగన్వాడి టీచర్ కు తెలిపారు. సామ్ మామ్ పిల్లల వివరాలను అడిగారు. పిల్లలకు గవర్నమెంట్ అందించే అన్ని ఆహారాలను తప్పనిసరిగా తినే విధంగా చర్యలు తీసుకోవాలని అంగన్వాడి టీచర్, ఆయాకు తెలిపారు. అదే గ్రామానికి చెందిన ఆశ వర్కర్లతో మాట్లాడారు గ్రామంలో డెంగ్యూ మలేరియా కేసులు ఏమైనా ఉన్నాయా అని అడగక ఇప్పటివరకు ఏమీ లేవని ఆశ వర్కర్లు కలెక్టర్ కు తెలిపారు. ఇంటింటికి ఫీవర్ సర్వే నిర్వహించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీవర్ వచ్చిన వారికి ఎలా తగ్గించుకోవాలో సలహాలు, సూచనలు ఇవ్వాలని తెలిపారు. బీపీ, షుగర్లు ఉన్న వారిని రెగ్యులర్ గా కలుస్తూ ఉండి వారి ఆహార అలవాట్లను పరిశీలించి,రోజు వ్యాయామం చేస్తే ఆరోగ్యంగా ఉంటారని తెలిపాలని సూచించారు. మందపల్లి జీపి అవాస గ్రామం అయిన పిట్టలవాడలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను ఏర్పాటు చేయడం కోసం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పిట్టల వాడలో ఇంతకుముందు 40 మంది విద్యార్థులతో అద్దె భవనంలో ప్రాథమిక పాఠశాల నడపగా అద్దె భవన యజమాని రావడంతో పాఠశాలకు ఎలాంటి భవనం లేకుండా పోయిందని పిల్లలు కొంతమంది వేరే పాఠశాలకు వెళ్తున్నారని, కొంతమంది బడి మానేశారని, ఇదే ప్రాంతంలో పాఠశాల కోసం ఇదివరకే కొంత ఖాళీ స్థలాన్ని కేటాయించారని జిల్లా విద్యాధికారి కలెక్టర్ దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ తప్పనిసరిగా ఆ ఖాళీ స్థలంలో తాత్కాలిక పద్ధతిలో రెండు రూములు, మరుగుదొడ్లుతో పాఠశాల భవనాన్ని నిర్మించాలని దానికి కావాల్సిన అన్ని పర్మిషన్లు, నిధులు కల్పిస్తానని ఇక్కడ నివసిస్తున్న ఏ ఒక్క విద్యార్థికి అన్యాయం జరగకుండా చూడాలని అధికారులకు తెలిపారు. ఈ పాఠశాలను యుద్ధప్రాతిపదికన పూర్తి అయ్యేలా చర్యలు తీసుకుంటానని విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చారు. కెసిఆర్ నగర్ లో ప్రైమరీ స్కూల్, జడ్ పి. హెచ్. ఎస్ హైస్కూల్ ను జిల్లా కలెక్టర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం డబుల్ బెడ్రూంలలో పాఠశాలను నడిపిస్తున్నారు. విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతి ఫిజిక్స్ సబ్జెక్టు సంబంధించి ప్రశ్నలు అడుగుతూ విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. పై స్థాయికి వెళ్లేందుకు పదవ తరగతి అనేది గట్టి పునాదని మనకు సబ్జెక్టు మీద పూర్తి అవగాహన ఉంటేనే పరీక్షలలో రాయగలుగుతామని, ముఖ్యంగా లాంగ్వేజ్ కి సంబంధించి ఇంగ్లీష్, హిందీ, తెలుగు సబ్జెక్టులలో చదవడం కంటే రెగ్యులర్ గా మాట్లాడుతుంటే వాటి గురించి ఎక్కువగా తెలుసుకోగలుగుతామని, మాట్లాడగలుగుతామని అన్నారు. ఇటీవల నిర్వహించిన పరీక్షలో మంచి మార్కులు వచ్చిన విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరు వారిని ఇన్స్పిరేషన్ గా తీసుకుని 10/10 జిపి ఎక్కవ మంది సాధించేందుకు కృషి చేయాలని తెలిపారు. కెసిఆర్ నగర్ లో ప్రైమరీ స్కూల్ కోసం కేటాయించిన 1ఎకరం ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. స్కూల్ నిర్మాణం కోసం ప్రపోజల్ పంపాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిఈఓ శ్రీనివాస్ రెడ్డి, అర్బన్ తహసిల్దార్ సలీం, విద్యాశాఖ సెక్టోరల్ అధికారి రామస్వామి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# శాంతియుత వాతావరణంలో గణేష్ నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి..

### జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్



రాజన్న సిరిసిల్ల: నవరాత్రి వేడుకలు సందర్భంగా మండపాల వద్ద నిమార్జనం సమయంలో డిజే లకు అనుమతి లేదు. నిర్దేశించిన సమయానికి మండపాల నిర్వాహకులు విగ్రాహల నిమార్జనం పూర్తి చెయాలి. నిబంధనలకు లోబడి గణేష్ ఉత్సవాలు జరుపుకోవాలి నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. సిరిసిల్ల పట్టణ పరిధిలోని కల్యాణ లక్ష్మీ గార్డెన్స్ లో రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వివిధ శాఖల అధికారులు, హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, సిరిసిల్ల సబ్ డివిజన్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వహకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై పాటించవలసిన నియమ నిబంధనాలపై దిశ నిర్దేశం చేసిన జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. లీస్ వారికి సహకరిస్తు శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రి వేడుకలు జరుపుకోవాలి, పోలీస్ శాఖ నుండి పూర్తి సహాయ సహకారాలు ఉంటాయన్నారు. మండపాల పూర్తి బాధ్యత మండపాల నిర్వహకులాదని,ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పకుండ ఏర్పాటు చేయలని, సీసీ కెమెరాల ఏర్పాటు వలన ఏ చిన్న సంఘటన జరిగిన గుర్తించ వచ్చన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, ఆసాంఘిక కార్యకలాపాలు పాల్పడితే వారితో పాటుగా మండపాల నిర్వహకులు పై కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ప్రతి మండపం వద్ద విధిగా పాయింట్ బుక్ ఏర్పాటు చేయడం జరుగుతుందని పోలీస్ అధికారులు,బ్లూ కోల్ట్ సిబ్బంది తరచు మండపాలు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు.

ఇనుప వస్తువులతో మండపాలు ఏర్పాటు చేయవద్దని, షాట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి మండపాల నిర్వహకులు విద్యుత్ శాఖ అనుమతి తీసుకోవాలి. నవరాత్రి వేడుకలు సందర్భంగా మండపాల వద్ద, నిమార్జనం సమయంలో డి.జే లకు అనుమతి లేదు. నవరాత్రి వేడుకల సందర్భంగా మండపాల్లో, నిమార్జనం రోజున డీజే లకు అనుమతి లేదని ఎస్పీ స్పష్టం చేశారు. అనుమతి లేకుండా డీజే మండపాల్లో కానీ నిమార్జనం రోజున ఉపయోగిస్తే డీజే వారితో పాటుగా మండపాల నిర్వహకులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికే జిల్లాలో డి.జే యజమానులకు కౌన్సెలింగ్ నిర్వహించడం జరిగిందన్నారు. నిర్దేశించిన సమయానికి మండపాల నిర్వాహకులు విగ్రాహల నిమార్జనం పూర్తి చెయాలి. గణేష్ నిమజ్జనం రోజున గణేష్ శోభయాత్ర రాత్రి 12 లోపు పూర్తి అయ్యేలా భక్తులు,గణేష్ మండపాల నిర్వహకులు పోలీస్ వారికి సహకరించాలని, రెండు మూడు రోజుల పాటుగా నిమజ్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. గత సంవత్సరం నిబంధనలకు విరుద్ధంగా రెండు మూడు రోజుల పాటుగా నిమజ్జనం చేస్తూ ప్రజలకు, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై 10 కేసులు నమోదు చేయడం జరిగిందన్నారు. నిమార్జననికి ముందు ప్రతి మండలంలో వివిధ శాఖల సమావేశాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఏమైనా సమస్యలు ఉంటే వారి దృష్టికి తీసుకరావాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ,డిఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి,సిరిసిల్ల ఆర్డీఓ రమేష్, మున్సిపల్ కమిషనర్ మీర్జా ఫసత్ అలీ బేగ్, జిల్లా పంచాయితీ అధికారి వీరబుచ్చయ్య, సిఐ లు కృష్ణ, శ్రీనివాస్, మొగిలి,ఎస్ఐ లు హిందూ ఉత్సవ కమిట్ సభ్యులు, మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

# త్వరలో ఆర్టీసీలో ఉద్యోగాల కొలువు

హైదరాబాద్: మరో రెండు, మూడు వారాల్లో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో కొలువుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడించారు. ఆయన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ఒక్క బస్సు కూడా కొనుగోలు చేయలేదని, ఉద్యోగ నియామకాలు చేపట్టలేదన్నారు. సంస్థను నష్టాల్లో ముంచిందని ఆరోపించారు. అయితే తమ ప్రభుత్వం మాత్రం సరికొత్త విధానాలతో ఆర్టీసీ కార్పొరేషన్‌ను ఒడ్డుకు చేర్చడమే కాకుండా.. లాభాల్లోకి తీసుకొచ్చామన్నారు. భారీగా ఉద్యోగాల భర్తీ, పెద్దసంఖ్యలో బస్సులను అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ఆర్టీసీని బలోపేతం చేస్తామని ఆయన తెలిపారు. ఇక ఇప్పటికే తొలి దశలో 3,035 ఉద్యోగాల భర్తీ చేసేందుకు నిర్ణయించగా.. సీఎం రేవంత్ కూడా ఆమోదం తెలిపారన్నారు. ఇందుకు సంబంధించి 2, 3 వారాల్లో నోటిఫికేషన్లు వస్తాయని చెప్పారు. మరో మూడు, నాలుగు వేల పోస్టుల భర్తీ అంశాన్ని కూడా పరిశీలిస్తున్నామని, దీనిపై కూడా త్వరలో ప్రకటన వెలువరిస్తామని అన్నారు. గత ప్రభుత్వం ఎన్నికల ముందు కంటి తుడుపు చర్యగా విలీన ప్రక్రియ చేపట్టింది. దీనిపై కమిటీ నిర్ణయం రావాల్సి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ వివరించారు. మరోవైపు ఒకే క్యాంపస్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పాఠశాలల భవనాలను నిర్మిస్తామన్నారు. 30 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కో దానికి రూ. 150 కోట్ల చొప్పున వ్యయంతో మొత్తం రూ. 4,500 కోట్లతో నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే భవనాలకు భూముల గుర్తింపు ప్రక్రియ మొదలైందని పేర్కొన్నారు. కాగా ఆర్టీసీలో త్వరలో భర్తీ చేయనున్న మొత్తం పోస్టుల్లో.. 2000 డ్రైవర్ పోస్టులు, 743 శ్రామిక్ పోస్టులు, 114 డిప్యూటీ సూపరింటెండెంట్ (మెకానిక్) పోస్టులు, 84 డిప్యూటీ సూపరింటెండెంట్ (ట్రాఫిక్) పోస్టులు, 25 డిపో మేనేజర్/అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ పోస్టులు, 23 అసిస్టెంట్ ఇంజనీర్ (సివిల్) పోస్టులు, 15 అసిస్టెంట్ మెకానికల్ ఇంజనీర్ పోస్టులు, 11 సెక్షన్ ఆఫీసర్ (సివిల్) పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్ (జనరల్) పోస్టులు, 7 మెడికల్ ఆఫీసర్ (స్పెషలిస్ట్) పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం రాష్ట్రంలో మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన రద్దీకి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో కొత్త బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఈ కొత్త బస్సులకు అనుగుణంగా నియమకాలు చేపడుతున్నట్లు సమాచారం.

# సంగారెడ్డిలో గంజాయి పట్టివేత

### 83.4 గంజాయి స్వాధీనం

### చిత్తూరుకు చెందిన వ్యక్తితో పాటు వాహనం సీజ్

### పట్టుకున్న గంజాయి విలువ.రూ 33. 50 లక్షలు

సంగారెడ్డి: శతకోటి ఉపాయాలకు అనంత కోటి మార్గాలు అన్నట్లుగా.. గంజాయి అక్రమ రవాణా దారులు పోలీసులకు చిక్కకుండా వివిధ రకాల జిమ్మిక్కులు చేస్తూ ఉంటారు. కానీ గంజాయి అక్రమార్కులు వేసే ఎత్తులను చిత్తు చేయడానికి ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు కొత్త కొత్త మార్గాలు కనిపెడుతూ వస్తూ ఉంటారు. ఇలాంటి ఘటననే సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం కొంకోల్ చెక్ పోస్ట్ వద్ద చోటు చేసుకుంది. ఏఓబి నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ పోలీసులు భగ్నం చేశారు. గాంధీ నాయక్, ఎస్సై అనిల్ కుమార్ సిబ్బందితో కలిసి పక్కగా వచ్చిన సమాచారం మేరకు కొంకూల్ చెక్ పోస్ట్ వద్ద వాహనాలను తనిఖీ చేపట్టారు. అనుమానం వచ్చిన మహారాష్ట్ర కు చెందినటువంటి టాటా సఫారీ వాహనాన్ని తనిఖీ చేశారు. వాహనంలో ఎలాంటి గంజాయి కనిపించలేదు.. కానీ అనుమానం వచ్చి వాహనం వెనుక భాగంలో ప్రాంతాన్ని పరిశీలించడంతో అందులో ప్రత్యేకంగా తయారు చేసినటువంటి అరల్లో గంజాయి పాకెట్లు కనిపించాయి. వాటిని ఒక్కొక్కటిగా బయటకు తీసి తూకం వేయగా గంజాయి మొత్తంగా 83.4 కేజీలుగా ఉంది.

గంజాయి తో పాటు రూ. 2000 నగదును కూడా స్వాధీనం చేసుకున్నారు. చిత్తూరు జిల్లా పుంగనూరు మండలం ఈటవాకిలి గ్రామానికి చెందిన ఆఫీజ్ ను అదుపులోకి తీసుకొని విచారించారు. ఏఓపి నుంచి ఒక వ్యక్తి గంజాయి పాకెట్లను నింపుకొని తీసుకొని ఇచ్చాడని ఈ వాహనాన్ని మహారాష్ట్రకు తరలించడానికి తీసుకు వెళుతున్నట్లు విచారణలో డ్రైవర్ అంగీకరించాడు. × పట్టుకున్న గంజాయి విలువ ప్లస్ వాహనంతో కలిపి మొత్తం రూ. 33. 50 లక్షల గా ఉంటుందని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గంజాయి ని పట్టుకున్న గాంధీ నాయక్, వీనారెడ్డి ఎస్సై అనిల్, సిబ్బంది హలీం అనిల్ కుమార్ రామారావు ప్రహ్లాదు లను ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ వి బి కమలాసన్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ జై హరీష్ అసిస్టెంట్ కమిషనర్ జి శ్రీనివాసరెడ్డి అభినందించారు.

# ఆర్డీవో కార్యాలయాలను ముట్టడించిన సర్పంచులు

నిర్మల్: భైంసా పట్టణంలో ఆర్డీవో కార్యాలయాన్ని సర్పంచులు ముట్టడించారు. నియోజక వర్గ వ్యాప్తంగా ఎన్నో అభివృద్ధి పనులు చేసి నేటికీ బిల్లులు అందక నానా ఇబ్బందులు పడుతున్న సర్పంచుల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, బిల్లులను విడుదల చేసిన తర్వాతే గ్రామపంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ సర్పంచుల సంఘం జాయింట్ యాక్షన కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేసిన తర్వాతే గ్రామపంచాయతీల ఎన్నికలు నిర్వహించాలని కోరుతూ ఆర్ అండ్ బి విశ్రాంతి భవనం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి కార్యాలయం వద్ద బైఠాయించారు. ఆర్డీవో కి వినతి పత్రం అందజేశారు.

వారు మాట్లాడుతూ గ్రామాలలో అభివృద్ధి అనే ఆకాంక్షతో వైకుంఠ ధామాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, డంపింగ్ యార్డులు, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు మొదలగు అనేక కార్యక్రమాలు విడతల వారీగా చేపట్టి ఆదర్శవంతమైన గ్రామాలుగా తీర్చిదిద్దడంలో సర్పంచుల పాత్ర కీలకమని వారు తెలిపారు. ఎంతో కష్టపడి గ్రామాలను అభివృద్ధి పథంలో తీసుకెళ్లిన సర్పంచుల బిల్లుల చెల్లింపుల్లో గత ప్రభుత్వం, తాజా ప్రభుత్వాలు జాప్యం చేస్తూ సర్పంచులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వారన్నారు. పెండింగ్ బిల్లుల విషయమై ప్రభుత్వానికి పలుమార్లు వినతి పత్రాలు అందించినా కాగితానికే పరిమితమయ్యాయని అన్నారు. బిల్లు రాక సర్పంచులు ఆత్మహత్య చేసుకున్నామని అన్నారు. ఈమేరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో సర్పంచుల పెండింగ్ బిల్లులు విడుదల చేసిన అనంతరమే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఇప్పటికైనా తమ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తమ సమస్యల పరిష్కరించాలని వారు కోరారు. లేనియెడల త్వరలోనే హైదరాబాదులో ధర్నా చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# కష్టపడిన ప్రతి కార్యకర్తను భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తాం

### – ఎవరు పార్టీ కోసం కష్టపడ్డారో, ఎవరు ఎంత పని చేశారో నాకు అన్ని తెలుసు

### – కష్ట కాలంలో నా వెంట ఉన్న ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడే

జగిత్యాల: అవకాశాలు వెత్తుకుంటూ మనం వెళ్ళడం కాదు,కష్టపడితే అవకాశాలే మన వెంట వస్తాయిని కష్టపడిన ప్రతి కార్యకర్తను భవిష్యత్తులో సముచిత స్థానం కల్పిస్తాం అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు.. మంగళవారం ధర్మపురి పట్టణం లోని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ మెంబర్ షిప్స్ కోసం నియోజక వర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు..ఈ సందర్భంగా ధర్మపురి మండలం (అప్పం తిరుపతి), బుగ్గారం మండలం (రెంటం శ్రీధర్) ,వెల్గటూర్ మండలం (పుదారి రమేష్), పెగడపెల్లి మండలం (పురుషోత్తం అనిల్), ధర్మారం మండలం(సొగల తిరుపతి),గొల్లపెల్లి మండలం( పురంశెట్టి గౌతమ్)లను యూత్ అధ్యక్షులుగా,నియోజకవర్గ యూత్ అధ్యక్షుడిగా ధర్మారం మండలం కి చెందిన ఆశోధ అజయ్ లను ప్రకటించారు.. అనంతరం మెంబర్ షిప్స్ ప్రక్రియను లాంచనంగా ప్రారంభించారు.. ఈ సంధర్భంగా ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఏ పార్టీలో నైన యువత అనేది ముఖ్య పాత్ర పోషించడం జరుగుతుందని, యూత్ కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు ప్రతి కష్టంలో నా వెంట ఉంటూ నన్ను ధర్మపురి నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలిపించడం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశీస్సులతో ప్రస్తుతం ప్రభుత్వ విప్ హోదాలో కొనసాగడం జరుగుతుందన్నారు..కష్ట కాలంలో నా వెంట ఉన్న ప్రతి కార్యకర్త నా కుటుంబ సభ్యుడేనని,యూత్ కాంగ్రెస్ కి సంబంధించిన నాయకులు కార్యకర్తలు ఎవరు కష్టపడ్డారో,ఎవరు పార్టీ కోసం ఎంత పని చేశారో నాకు అన్ని తెలుసునని, కష్టపడిన ప్రతి కార్యకర్తను భవిష్యత్తులో సముచిత స్థానాల్లో ఉంచుతామని,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా మంథని నియోజకవర్గం తర్వాత ధర్మపురి నియోజక వర్గం గురించి అడిగే స్థాయిలో పని చేయడం జరుగుతుందని, అది మీ అందరి సహాయ సహకారాల వల్లనే సాధ్యం కావడం జరిగిందన్నారు.. ప్రతి మండలంలో అత్యధికంగా మెంబర్ షిప్స్ కొట్టించే బాధ్యత ప్రతి యూత్ అధ్యక్షుడిపైన ఉందని,అదే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన పథకాలను సోషల్ మీడియాలో ప్రచారం చేయాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ పైన ఉందన్నారు.. ,అవకాశాలు వెత్తుకుంటూ మనం వెళ్ళడం కాదని, కష్టపడితే అవకాశాలే మన వెంట వస్తాయని,రాష్ట్ర స్థాయిలో మన ధర్మపురి నియోజకవర్గాన్ని మెంబర్ షిప్స్ లో ముందుండే విధంగా కృషి చేయాలని ఈ సందర్భంగా విప్ తెలిపారు..ఈ కార్యక్రమంలో అన్ని మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, నియోజక వర్గ స్థాయి యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై చెప్పిన డేవిడ్ మలన్

ఇంగ్లాండ్ క్రికెటర్ డేవిడ్ మలన్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. 37 ఏళ్ల మలన్ ఇంగ్లాండ్ తరఫున 22 టెస్టులు, 30 వన్డేలు, 62 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. టీ20ల్లో ఇతడికి మంచి రికార్డు ఉంది. పురుషుల క్రికెట్ పొట్టి ఫార్మాట్‌లో అత్యంత వేగంగా 1,000 పరుగులు చేసింది ఈ క్రికెటరే. మలన్ 24 ఇన్నింగ్స్‌ల్లోనే వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. 2020 సెప్టెంబరులో టీ20 ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో నిలిచాడు. జోస్ బట్లర్ తర్వాత ఇంగ్లాండ్ తరఫున మూడు ఫార్మాట్లలో సెంచరీలు సాధించిన రెండో ఆటగాడిగానూ మలన్ గుర్తింపు పొందాడు. టెస్టుల్లో, టీ20ల్లో ఒక్కో సెంచరీ చేసిన ఇతను వన్డేల్లో 6 శతకాలు బాదాడు. భారత్‌లో జరిగిన 2023 వన్డే ప్రపంచ కప్ తర్వాత మలన్ తిరిగి ఇంగ్లాండ్ జట్టుకు ఎంపిక కాలేదు. టెస్టుల్లో




1074, వన్డేల్లో 1450, టీ20ల్లో 1892 పరుగులు చేశాడు.

Editor,Printer, Publisher & Owner by **Reddy Shekar**,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48
**SS Printers,** (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, **E Mail : teenmaardesk@gmail.com, Cell : 9177108128**